ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి
"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.
అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.
- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 114, పేజీలు - 08

ఆదివారం,అక్టోబర్ 25, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




# ఏంటి ఈ పనులు..! మీకు బాధ్యత లేదా..?

## మీరెప్పుడు మారుతారు..?

- ఫోర్జరీ ఆరోపణల మధ్య బార్ లైసెన్స్ రెన్యువల్స్!
- ఎక్సైజ్ శాఖకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదా?
- ట్రూత్ లాబ్స్ నివేదికలు.. ఎఫ్ఐఆర్ నమోదైనా కొనసాగిన లైసెన్స్ వ్యవహారం!

( అనంచిన్ని వెంకటేశ్వరరావు, ప్రముఖ పరిశోధన పాత్రికేయులు, 9440000009)

(అంకితం: తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి వర్యులకు)





రంగారెడ్డి జిల్లా సెరిలింగంపల్లి పరిధిలోని ఎం.వి.ఆర్. బార్ ఁ రెస్టారంట్, బార్ లైసెన్స్ వ్యవహారం ఇప్పుడు హైకోర్టు గడప తొక్కింది. అద్దె ఒప్పందాల ఫోర్జరీ, తప్పుడు పత్రాలతో ఎక్సైజ్ లైసెన్స్ రెన్యువల్ చేయించుకున్నారనే ఆరోపణలపై వ్యాపారవేత్త జెరిపేటి యాదగిరి తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు.యాదగిరి దాఖలు చేసిన రిట్ పిటిషన్ ప్రకారం తాను యజమానిగా ఉన్న ప్రాంగణాన్ని 2012లో బార్ అండ్ రెస్టారెంట్ నిర్వహణ కోసం మారబోయిన సంతోష్? కాదు, మారబోయిన సందీప్కు నెలకు రూ.40 వేల అద్దెకు ఇచ్చినట్లు పేర్కొన్నారు. 2012 నవంబర్ 28న కుదిరిన అద్దె ఒప్పందం ఐదేళ్ల కాలానికి మాత్రమేనని, అయితే 2014లో తన సంతకం లేకుండానే మరో అద్దె ఒప్పందం సృష్టించి ఎక్సైజ్ అధికారుల ముందు సమర్పించారని పిటిషనర్ ఆరోపించారు.

### "నా సంతకం కాదు".. ట్రూత్ లాబ్స్ నివేదికలతో సంచలనం

ఈ వ్యవహారంలో కీలకంగా ట్రూత్ లాబ్స్ శాస్త్రీయ అభిప్రాయాలను పిటిషనర్ సమర్పించినట్లు రిట్లో పేర్కొన్నారు. 01-03-2014 తేదీతో ఉన్న అద్దె ఒప్పందంపై తన సంతకం లేదని ట్రుథ్ లాబ్స్ 06-10-2025 తేదీన అభిప్రాయం ఇచ్చిందని యాదగిరి పేర్కొన్నారు. అంతేకాకుండా, 04-07-2017 తేదీతో ఉన్న మరో అద్దె ఒప్పందంపైనా శాస్త్రీయ పరిశీలన చేయించగా, దానిపైనా తన సంతకం లేదని నివేదికలో నిర్ధారించినట్లు పిటిషన్లో పేర్కొన్నారు. ఈ రెండు పత్రాలను ఆధారంగా చేసుకుని బార్ లైసెన్స్ను కాలానుగుణంగా పొడిగించుకున్నారని పిటిషనర్ ఆరోపించారు.

### ఫిర్యాదుల తర్వాత కూడా లైసెన్స్ రెన్యువల్?

ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతోంది. ఫోర్జరీ ఆరోపణలతో పాటు ట్రూత్ లాబ్స్ నివేదికలను జతచేసి 13-10-2025న ఎక్సైజ్ అధికారులకు లిఖితపూర్వక ఫిర్యాదు చేసినప్పటికీ, సంబంధిత అధికారులు చర్యలు తీసుకోలేదని పిటిషనర్ ఆరోపించారు. అంతకుముందే 08-07-2025న కూడా బార్ లైసెన్స్ రెన్యువల్ చేయవద్దంటూ ప్రతినిధిత్వం ఇచ్చినట్లు రిట్లో పేర్కొన్నారు. అయినప్పటికీ అధికారులు లైసెన్స్ను కొనసాగిస్తూ వచ్చారని ఆయన ఆరోపించారు.

### పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసిన తర్వాత వివాదం మరింత తీవ్రం

ట్రూత్ లాబ్స్ నివేదికల అనంతరం 15-11-2025న చందానగర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా ఎఫ్ఐఆర్ నెం.1333/2025 నమోదు చేసినట్లు పిటిషన్లో పేర్కొన్నారు. రిట్ ప్రకారం, ఈ ఎఫ్ఐఆర్ లో బిఎన్ఎస్ సెక్షన్లు 318(4), 336(3), 340(2) కింద కేసు నమోదైంది. అంటే ఒకవైపు పత్రాల నిజస్వరూపంపై శాస్త్రీయ నివేదికలు ఉన్నాయని పిటిషనర్ చెబుతుండగా, మరోవైపు ఈ అంశంపై క్రిమినల్ కేసు కూడా నమోదైందని రిట్లో పేర్కొన్నారు.

### ఎక్సైజ్ అధికారుల పాత్రపైనా ప్రశ్నలు!

పిటిషనర్ ఆరోపణలు కేవలం బార్ నిర్వహిస్తున్న వ్యక్తులకే పరిమితం కాలేదు. ఫోర్జరీగా పేర్కొంటున్న అద్దె ఒప్పందాలు ఎక్సైజ్ అధికారుల ముందు సమర్పించబడ్డాయని, వాటి ఆధారంగా లైసెన్స్ రెన్యువల్స్ జరిగాయని ఆయన ఆరోపించారు. అంతేకాకుండా, తాను పలుమార్లు ఎక్సైజ్ కమిషనర్కు ఫిర్యాదు చేసి, లైసెన్స్ రెన్యువల్ చేయవద్దని కోరినా చర్యలు తీసుకోలేదని రిట్లో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారుల వ్యవహారశైలిపైనా న్యాయపరమైన పరిశీలన అవసరమని పిటిషనర్ కోరుతున్నారు.

### హైకోర్టు తలుపు తట్టిన యాదగిరి

అధికారుల నుంచి స్పందన రాకపోవడంతో చివరకు ఆర్టికల్ 226 కింద హైకోర్టును ఆశ్రయించినట్లు పిటిషన్లో పేర్కొన్నారు. బార్ లైసెన్స్ను రద్దు చేయడం, ఫోర్జరీ మరియు తప్పుడు ప్రకటనలపై క్రిమినల్ చర్యలు తీసుకోవడం, సంబంధిత వ్యక్తుల పేర్లను బ్లాక్ లిస్ట్లో పెట్టడం, అలాగే తమ ఫిర్యాదులపై చర్యలు తీసుకోని ఎక్సైజ్ అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని హైకోర్టును కోరారు.

### ఇప్పుడు అసలు ప్రశ్నలు ఇవే!

- ఫోర్జరీగా ఆరోపిస్తున్న అద్దె ఒప్పందాల ఆధారంగా బార్ లైసెన్స్ ఎలా రెన్యువల్ అయ్యింది? - ట్రూత్ లాబ్స్ నివేదికలను ఎక్సైజ్ అధికారులు పరిశీలించారా? - ఎఫ్ఐఆర్ నమోదైన తర్వాత కూడా లైసెన్స్ వ్యవహారంపై శాఖ ఏ చర్యలు తీసుకుంది? - అధికారులకు ముందుగానే ఫిర్యాదులు అందినట్లయితే వాటిపై తీసుకున్న చర్యలేమిటి? - పత్రాల నిజస్వరూపంపై క్రిమినల్ దర్యాప్తు కొనసాగుతున్న సమయంలో లైసెన్స్ రెన్యువల్కు ఆధారం ఏమిటి.? ఈ ప్రశ్నలకు ఎక్సైజ్ శాఖ నుంచి స్పష్టమైన సమాధానం రావాల్సి ఉంది. అయితే, పిటిషన్లో చేసిన ఆరోపణలు మరియు ట్రూత్ ల్యాబ్ నివేదికలపై తుది చట్టపరమైన నిర్ణయం సంబంధిత దర్యాప్తు/న్యాయ ప్రక్రియలోనే తేలాల్సి ఉంది.

# తెలంగాణలో కమలదళం బిగ్ ప్లాన్



- మోదీ, షాలతో అసంబ్లీ పోరుకు బీజేపీ సిద్ధం!

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాజకీయాల్లో భారతీయ జనతా పార్టీ తన అసలైన రాజకీయ దూకుడును ప్రదర్శించేందుకు సిద్ధమైంది. సార్వత్రిక, శాసనసభ ఎన్నికలకు ఇంకా దాదాపు రెండేళ్ల సమయం మాత్రమే ఉండటంతో ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో గట్టిగా పాగా వేయడమే లక్ష్యంగా బీజేపీ అగ్రనాయకత్వం నూతన వ్యూహాలకు పదును పెడుతోంది. ఇందులో భాగంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా నవంబర్లో, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ డిసెంబర్లో తెలంగాణలో సుడిగాలి పర్యటనలు చేపట్టేందుకు తుది షెడ్యూల్ ఖరారైంది. ఢిల్లీ పెద్దలే నేరుగా మైదానంలోకి దిగుతుండటంతో కమలదళంలో సరికొత్త ఉత్సాహం నిండడమే కాకుండా, రాష్ట రాజకీయాల్లో వేడి ఒక్కసారిగా పెరిగింది.

### ప్రధాన పోటీదారుగా ఎదిగేందుకు ప్రయత్నాలు

రాష్ట్రంలో అధికారంలో ఉన్న రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై పెరుగుతున్న ఆర్థిక సమస్యలు, విద్యుత్ డిమాండ్, ఎల్నినో సవాళ్లు, రైతు రుణమాఫీ 2లో..

# బ్యాంకింగ్ నుంచి బీమా వరకు

- 46 ఆర్థిక అంశాలపై పార్లమెంటరీ కమిటీ అధ్యయనం!



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) దేశ ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేస్తున్న కీలక పరిణామాలు, భవిష్యత్తులో చేపట్టాల్సిన సంస్కరణలపై పార్లమెంటరీ స్థాయీ సంఘం దృష్టి సారించింది. క్రిప్టో ఆస్తుల నుంచి ఆర్థిక రంగంలో కృత్రిమ మేధ (ఏఐ) వినియోగం 2లో..

# అంజలి పెళ్లికి మరో వేదిక చూసుకోగలవు

- షర్మిలకు వైఎస్ జగన్ లేఖ



అమరావతి (ప్రశ్న న్యూస్) వైసీపీ అధినేత జగన్ తన సోదరి షర్మిలకు రాసిన ఓ లేఖను ఆ పార్టీ తాజాగా విడుదల చేసింది. షర్మిల కుమార్తె అంజలి వివాహానికి సంబంధించి అక్టోబర్ 9న రాసిన ఈ లేఖలో, పెళ్లి వేదిక విషయంలో జగన్ తన అభ్యంతరాలను, కారణాలను స్పష్టంగా వివరించారు. మేనకోడలు అంజలి వివాహం జరగనుండటం పట్ల జగన్ తొలుత సంతోషం వ్యక్తం చేశారు. అయితే, ఈ వేడుకను బెంగళూరులోని తన నివాసంలో నిర్వహించాలని షర్మిల కుటుంబం భావిస్తున్నట్లు తెలిసిందని, 2లో..

# "హిట్ అండ్ రన్" రాజకీయాలు చేస్తున్నారు

- పంజాబ్ నుంచి కిరాయి ముఠాలు తీసుకొచ్చిన వైసీపీ
- జగన్ హయాంలో భారీగా ఏకగ్రీవాలు
- జగన్ పై చంద్రబాబు విమర్శలు




**అమరావతి (ప్రశ్న న్యూస్)** స్థానిక సంస్థల ఎన్నికల తొలి రోజు నుంచే అడ్డంకులు సృష్టించేందుకు వైఎస్సార్సీపీ శతవిధాలా ప్రయత్నించిందని, ఆ పార్టీ కేవలం క్రిమినల్ పాలిటిక్స్కే పరిమితమైందని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో ప్రతిపక్ష వైఎస్సార్సీపీ ప్రోత్సాహంతోనే హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. మీడియా సమావేశంలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో దౌర్జన్యాలకు పాల్పడటమే కాకుండా, ఒక ఎంపీ తన వాహనంతో ఎన్డీఏ కార్యకర్తలను తొక్కించే దుశ్చర్యకు ఒడిగట్టారని ఆరోపించారు. ఆ వాహనంలో భారీగా మద్యం 2లో..

# బ్యారేజీల పునరుద్ధరణలో రాజకీయ దురుద్దేశం లేదు

- సాగునీటి రంగాన్ని నాశనం చేసింది కేసీఆర్ కంపెనీయే




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల వైఫల్యాలను కప్పిపుచ్చుకుంటూ, ఎల్నినో పరిస్థితులను సైతం రాజకీయ ప్రయోజనాలకు వాడుకునేందుకు బీఆర్ఎస్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్రావు చేస్తున్న ప్రచారం జోసెఫ్ గోబెల్స్ను మించిపోయిందని విరుచుకుపడ్డారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో 2లో..

# తుమ్మిడిహట్టిపై మహారాష్ట్రతో చర్చలు

- సోమవారం ముంబయికి సీఎం రేవంత్రెడ్డి
- కృష్ణా నదీ యాజమాన్య బోర్డు సమావేశం వాయిదా
- తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు బోర్డు నిర్ణయం
- మంగళవారానికి సమావేశాన్ని తిరిగి షెడ్యూల్ చేసిన కేఆర్ఎంబీ

2లో..



## టిజిపిఎస్సి ఎఈఈ ఎగ్జామ్ వాయిదా వేయండి

- సీఎం రేవంత్కు హరీష్ రావు లేఖ

2లో..



## కేంద్ర నిధులపై తెలంగాణ సర్కార్ ఫోకస్

2లో..

- అధికారులకు సీఎస్ సంజయ్ జాజు కీలక ఆదేశాలు



# తెలంగాణలో కమలదళం బిగ్ ప్లాన్

హామీల అమలులో ఉన్న సాంకేతిక లోపాలను తమకు అనుకూలంగా మలచుకోవడమే బీజేపీ ప్రథమ లక్ష్యంగా కనిపిస్తోంది. మరోవైపు, ఓటమి తర్వాత అంతర్గత సంక్షోభంలో ఉన్న బీఆర్ఎస్ ఖాళీ చేసిన ప్రధాన ప్రతిపక్ష స్థానాన్ని ఆక్రమించి, కాంగ్రెస్‌కు ఏకైక ప్రత్యామ్నాయంగా ఎదిగేందుకు బీజేపీ హైకమాండ్ ఈ కార్యాచరణను రూపొందించింది. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల వైఫల్యాలను ఎండగడుతూ ప్రజల్లోని వ్యతిరేకతను పక్కాగా ఒడిసిపట్టేందుకు ఢిల్లీ నాయకత్వమే స్వయంగా ఈ గేమ్‌ప్లాన్‌ను పర్యవేక్షిస్తోంది.

### బూత్ స్థాయి నుంచి బలోపేతంపై దృష్టి

నవంబర్‌లో పర్యటించనున్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ముఖ్యంగా పార్టీ సంస్థాగత బలోపేతం, బూత్ స్థాయి కమిటీల పనితీరు మరియు క్షేత్రస్థాయి వ్యూహాలపై దృష్టి సారించనున్నారు. నాయకుల మధ్య సమన్వయం పెంచడం, సోషల్ మీడియా నెట్‌వర్క్‌ను మరింత పటిష్టం చేయడం , బూత్ స్థాయి సైనికులకు దిశానిర్దేశం చేయడం ఆయన పర్యటన ప్రధాన ఉద్దేశం. అసమ్మతికి తావులేకుండా, పార్టీ లైన్‌దాటి వ్యవహరించే నేతలకు గట్టి సందేశం ఇస్తూనే క్షేత్రస్థాయి కష్టపడే కార్యకర్తలకు నేరుగా బాధ్యతలు అప్పగించే దిశగా అమిత్ షా దిశానిర్దేశం చేయనున్నారు. డిసెంబర్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన వేళ బహుముఖ వ్యూహాన్ని అమలు చేయాలని పార్టీ భావిస్తోంది. కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు మంజూరు చేసిన వివిధ జాతీయ రహదారులు, రైల్వే లైన్లు , ఇతర అభివృద్ధి ప్రాజెక్టుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలతో పాటు భారీ బహిరంగ సభను నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. "డబుల్ ఇంజిన్ సర్కార్" ద్వారా మాత్రమే తెలంగాణ అభివృద్ధి సాధ్యమనే నినాదాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తూ, కేంద్ర నిధుల వినియోగంపై స్పష్టమైన విశ్లేషణను ప్రజల ముందు ఉంచడం ద్వారా భావోద్వేగపూరిత, నమ్మకమైన వాతావరణాన్ని సృష్టించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.

### బెంగాల్ తరహా దూకుడైన ప్లాన్

తెలంగాణలో బీజేపీ అనుసరిస్తున్న ఈ ముందస్తు వ్యూహం వెనుక ఒక స్పష్టమైన లక్ష్యం ఉంది. ఎన్నికల సమయం దాకా వేచి చూడకుండా, నామమాత్రపు విమర్శలతో సరిపెట్టకుండా రెండేళ్ల ముందే కేడర్‌ను సమరశంఖానికి సిద్ధం చేయడం ద్వారా ప్రత్యర్థులను తీవ్ర ఆత్మరక్షణలో పడేయవచ్చని భావిస్తున్నారు. మూడో ప్రత్యామ్నాయంగా మిగిలిపోకుండా కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ అనే రేసును నిర్మించడం ద్వారా బీఆర్ఎస్‌కు ఓటేస్తే కాంగ్రెస్‌కే మేలు జరుగుతుందనే ప్రచారాన్ని ప్రజల మెదళ్లలో నాటేందుకు కమలదళం యత్నిస్తోంది. ఢిల్లీ అగ్రద్వయం నేరుగా రంగంలోకి దిగుతుండటంతో తెలంగాణలో భాజపా తన అసలైన గేమ్‌ప్లాన్‌కు శ్రీకారం చుట్టినట్లయింది. భవిష్యత్తులో ఎలాంటి తాత్కాలిక పొత్తులు, ఆందోళనలు లేకుండా స్వశక్తితో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడమే అంతిమ లక్ష్యంగా కమలదళం పక్కా ప్లాన్లతో అడుగులు వేస్తోంది. రాబోయే నవంబర్, డిసెంబర్ పర్యటనలు తెలంగాణ రాజకీయాల్లో ఎటువంటి సంచలన పరిణామాలకు దారితీస్తాయో వేచి చూడాల్సిందే.

# బ్యాంకింగ్ నుంచి బీమా వరకు

వరకు మొత్తం 46 కీలక అంశాలను 2026–27 ఆర్థిక సంవత్సరంలో అధ్యయనం చేయాలని నిర్ణయించింది. బ్యాంకింగ్, బీమా, పెన్షన్, కరెన్సీ నిర్వహణ, ధరల స్థిరత్వం, పన్నుల సంస్కరణలు, ప్రభుత్వ ఆస్తుల నగదీకరణతో పాటు ఆర్థిక నియంత్రణ వ్యవస్థల పనితీరును కూడా సమగ్రంగా పరిశీలించనుంది. ఈ అంశాలపై అధ్యయనం చేసి నివేదికలు సిద్ధం చేయనున్నట్లు లోక్‌సభ బులెటిన్ వెల్లడించింది.లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఈ నెల ప్రారంభంలో వివిధ మంత్రిత్వ శాఖలకు సంబంధించిన పార్లమెంటరీ కమిటీలను పునర్వ్యవస్థీకరించారు. ఇందులో భాగంగా ఆర్థిక వ్యవహారాల స్థాయీ సంఘం ఛైర్మన్‌గా బీజేపీ ఎంపీ భర్తృహరి మహతాబ్‌ను మరోసారి నియమించారు. ఈ కమిటీలో లోక్‌సభ నుంచి 21 మంది, రాజ్యసభ నుంచి 10 మంది సభ్యులు ఉన్నారు. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని వివిధ విభాగాలతో పాటు కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, నీతి ఆయోగ్, గణాంకాలు–కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖలకు సంబంధించిన అంశాలనూ కమిటీ పరిశీలించనుంది.

### క్రిప్టో, ఏఐ.. కొత్త సవాళ్లపై దృష్టి

డిజిటల్ ఆర్థిక వ్యవస్థ విస్తరిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో వర్చువల్ డిజిటల్ ఆస్తులు, క్రిప్టో కరెన్సీలకు సంబంధించిన అంశాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఈ నేపథ్యంలో క్రిప్టో ఆస్తుల ప్రస్తుత పరిస్థితులు, భవిష్యత్తు, వాటికి సంబంధించి అనుసరించాల్సిన విధానాలను కమిటీ అధ్యయనం చేయనుంది. మరోవైపు బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, డిజిటల్ లావాదేవీల్లో కృత్రిమ మేధ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో దాని వల్ల కలిగే అవకాశాలు, ఎదురయ్యే సమస్యలను విశ్లేషించనుంది. ఆర్థిక రంగంలో నియంత్రణ వ్యవస్థల పనితీరు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీల (ఎన్‌బీఎఫ్‌సీ) రంగంలో ఉన్న నియంత్రణ లోపాలపైనా దృష్టి సారించనుంది. పర్యవేక్షణ, పారదర్శకతను మెరుగుపరిచేందుకు అవసరమైన చర్యలపై నివేదికలు రూపొందించనుంది.

### ధరల స్థిరత్వం.. రూపాయి విలువపై సమీక్ష

దేశ ఆర్థిక వ్యవస్థలో ధరల స్థిరత్వం, కరెన్సీ నిర్వహణ కీలక పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో ఈ అంశాలపై కమిటీ ప్రత్యేకంగా దృష్టి పెట్టనుంది. మారుతున్న స్థూల ఆర్థిక పరిస్థితులు, ధరల నియంత్రణకు అనుసరిస్తున్న వ్యూహాలు, ఎదురవుతున్న సవాళ్లను సమీక్షించనుంది. భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్‌బీఐ) పాత్రతో పాటు రూపాయి విలువకు సంబంధించిన అంశాలను పరిశీలించనుంది. చిన్న మొత్తాల పొదుపు పథకాల పనితీరు, వాటి ప్రాధాన్యం, ప్రభుత్వ రంగ ఆస్తుల నగదీకరణ ద్వారా వనరులను సమర్థంగా వినియోగించుకునే మార్గాలపైనా అధ్యయనం చేయనుంది. బ్యాంకింగ్, పెన్షన్, ఆరోగ్య బీమా రంగాల పనితీరుతో పాటు అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత కల్పించే అంశాలనూ పరిశీలించనుంది. కేంద్ర ప్రభుత్వ వివిధ పథకాల అమలు, వాటి ఫలితాలను సమీక్షించి సంబంధిత రంగాల్లో మెరుగుదలకు అవసరమైన సూచనలు చేయనుంది.

### జీఎస్‌టీ, ప్రత్యక్ష పన్నుల్లో సంస్కరణలపై కసరత్తు

పన్నుల వ్యవస్థలో మార్పులు, సంస్కరణలు కూడా కమిటీ పరిశీలనలో కీలక అంశాలుగా ఉన్నాయి. కస్టమ్స్ సుంకాలు, వస్తు–సేవల పన్ను (జీఎస్‌టీ), ప్రత్యక్ష పన్నుల విధానాల్లో చేపట్టాల్సిన మార్పులపై అధ్యయనం చేయనుంది. పన్నుల విధానాలు ఆర్థిక కార్యకలాపాలు, ప్రభుత్వ ఆదాయంపై చూపుతున్న ప్రభావాన్ని అంచనా వేసి సంస్కరణల అవసరాన్ని పరిశీలించనుంది. సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) పనితీరును సమీక్షించడంతో పాటు ఆర్థిక మార్కెట్ల నియంత్రణ, పెట్టుబడిదారుల ప్రయోజనాల పరిరక్షణకు సంబంధించిన అంశాలపైనా దృష్టి సారించనుంది.

### కంపెనీల పాలన.. ఆడిటర్ల జవాబుదారీతనం

కార్పొరేట్ రంగంలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించేందుకు తీసుకోవాల్సిన చర్యలను కూడా కమిటీ పరిశీలించనుంది. జాతీయ కంపెనీ చట్ట ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై అధ్యయనం చేయనుంది. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్), కంపెనీల ఈ–గవర్నెన్స్, ఆడిటర్ల జవాబుదారీతనం వంటి అంశాలను సమీక్షించనుంది. కంపెనీల నిర్వహణలో పారదర్శకతను మెరుగుపరిచే మార్గాలను గుర్తించనుంది.

### నీతి ఆయోగ్, ఆర్థిక గణాంకాలపైనా పరిశీలన

రంగాలవారీ అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనలో నీతి ఆయోగ్ పాత్రను కమిటీ అధ్యయనం చేయనుంది. వెనుకబడిన జిల్లాల అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకున్న ఆకాంక్షిత జిల్లాల కార్యక్రమం పనితీరును సమీక్షించనుంది. గణాంకాలు–కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ పరిధిలో జాతీయ ఖాతాల గణాంకాలపై అధ్యయనం చేపట్టనుంది. దేశ ఆర్థిక పరిస్థితిని అంచనా వేయడానికి అవసరమైన గణాంకాల సేకరణ, విశ్లేషణ వ్యవస్థను మరింత పటిష్ఠం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలను సూచించనుంది. మొత్తంగా డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో వస్తున్న మార్పుల నుంచి సంప్రదాయ బ్యాంకింగ్, పన్నుల విధానాలు, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ వరకు విస్తృతమైన అంశాలను ఈ కమిటీ పరిశీలించనుంది. ఆయా రంగాల్లో విధానాల అమలు, పనితీరు, నియంత్రణ వ్యవస్థలు, సంస్కరణల అవసరాన్ని అంచనా వేసి రూపొందించే నివేదికలు భవిష్యత్తు ఆర్థిక విధానాల రూపకల్పనకు ఉపయోగపడే అవకాశం ఉంది.

# అంజలి పెళ్లికి మరో వేదిక చూసుకోగలవు

కానీ అక్కడ ఈ కార్యక్రమం నిర్వహిస్తే తీవ్రమైన భద్రతాపరమైన సమస్యలు ఎదురవుతాయని ఆయన హెచ్చరించారు. భద్రత, వ్యక్తిగత గోప్యతకు సంబంధించిన అంశాలను విస్మరించవద్దని షర్మిలను కోరారు.బెంగళూరులోని ఇల్లు తన కుటుంబ నివాసమని, అక్కడ తాము సురక్షితంగా ఉండాల్సిన అవసరం ఉందని జగన్ నొక్కిచెప్పారు. తన సొంత పిల్లల వివాహం విషయంలో కూడా భద్రత దృష్ట్యా తాను ఇలాంటి నిర్ణయమే తీసుకుంటానని స్పష్టం చేశారు. ఈ విషయంలో తన ఇబ్బందులను ఇప్పటికే కొందరి ద్వారా తెలియజేసినా, తన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకపోవడం బాధ కలిగించిందని ఆవేదన వ్యక్తం చేశారు. తన పరిస్థితిని అర్థం చేసుకొని, దయచేసి మరో వేదికను ఎంచుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అవసరమైతే హైదరాబాద్‌లోని లోటస్ పాండ్‌లోనైనా వివాహం జరుపుకోవచ్చని సూచించారు. అంజలి వివాహ ఏర్పాట్లకు సంబంధించి జరుగుతున్న చర్చల నేపథ్యంలో, జగన్ వైఖరిని స్పష్టం చేసేందుకే వైసీపీ ఈ లేఖను విడుదల చేసినట్లు తెలుస్తోంది.

# తుమ్మిడిహట్టిపై మహారాష్ట్రతో చర్చలు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య కృష్ణా నదీ జలాల పంపిణీపై చర్చించేందుకు సోమవారం (అక్టోబర్ 26) జరగాల్సిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) 21వ సమావేశం వాయిదా పడింది. తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు ఈ భేటీని మంగళవారానికి వాయిదా వేస్తున్నట్లు బోర్డు ప్రకటించింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం ముంబై పర్యటనకు వెళ్లనున్న నేపథ్యంలో, రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరు కాలేరని తెలంగాణ ఇంజనీర్–ఇన్–చీఫ్ కేఆర్ఎంబీకి లేఖ ద్వారా తెలియజేశారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్టుకు సంబంధించిన కీలక చర్చల నిమిత్తం ముఖ్యమంత్రి మహారాష్ట్రకు వెళుతున్నట్లు ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ కారణం చేత సమావేశాన్ని వాయిదా వేయాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న కేఆర్ఎంబీ, సమావేశాన్ని మంగళవారానికి రీషెడ్యూల్ చేసింది. ఈ మార్పునకు సంబంధించిన సమాచారాన్ని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు అధికారికంగా తెలియజేసింది. తెలుగు రాష్ట్రాల మధ్య నెలకొన్న జల వివాదాలు, నీటి పంపిణీకి సంబంధించిన కీలక అంశాలపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించనున్నారు.

# కేంద్ర నిధులపై తెలంగాణ సర్కార్ ఫోకస్

**- అధికారులకు సీఎస్ సంజయ్ జాజు కీలక ఆదేశాలు**

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** కేంద్ర ప్రాయోజిత పథకాల కింద రాష్ట్రానికి అందాల్సిన నిధులను సత్వరమే రాబట్టి, వాటిని సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. నిధుల విడుదలలో జాప్యాన్ని నివారించాలని, పెండింగ్‌లో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఉన్నతాధికారులతో ఆయన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరును, నిధుల వినియోగాన్ని సీఎస్ సమీక్షించారు. లభ్యతలో ఉన్న నిధులను పూర్తిస్థాయిలో వాడుకోవడంపై అన్ని శాఖలు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నిధుల విడుదలకు అవసరమైన పరిపాలనాపరమైన ప్రక్రియలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు.కేంద్ర ప్రభుత్వ అదనపు కార్యదర్శులతో నిరంతరం సమన్వయం సాధించడం ద్వారా నిధుల విడుదలలో ఎదురయ్యే అడ్డంకులను తొలగించుకోవాలని అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. అవసరమైతే ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ కార్యదర్శులతో తానే స్వయంగా చర్చిస్తానని, సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరింత వేగవంతం చేసేందుకు కేంద్ర పథకాల ద్వారా గరిష్ట ప్రయోజనాలను పొందడమే లక్ష్యంగా ఈ సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సీనియర్ అధికారులు మహేశ్ దత్ ఎక్కా, దాన కిశోర్, రాహుల్ బొజ్జా, సందీప్ కుమార్ సుల్తానియా, యోగితా రాణా తదితరులు పాల్గొన్నారు.

### టిజిపిఎస్‌సి ఎఈఈ ఎగ్జామ్

# వాయిదా వేయండి

**- సీఎం రేవంత్‌కు హరీష్ రావు లేఖ**

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలోని ఇంజినీరింగ్ విద్యార్థుల ఉద్యోగ అవకాశాలను దెబ్బతీయవద్దంటూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి హరీశ్ రావు బహిరంగ లేఖ రాశారు. వచ్చే నవంబర్ 6వ తేదీన జరగనున్న టిజిపిఎస్‌సి ఎఈఈ పరీక్షను తక్షణమే వాయిదా వేయాలని ఆయన సీఎంను కోరారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నిర్వహించే ఎస్ఎస్సి జెఈ ఎగ్జామ్, రాష్ట్ర స్థాయి టిజిపిఎస్‌సి ఎఈఈ పరీక్షలు ఒకే రోజున నిర్వహించడం వల్ల వేలాది మంది తెలంగాణ ఇంజినీరింగ్ అభ్యర్థులు విలువైన ఉద్యోగ అవకాశాలను కోల్పోయే ప్రమాదం ఏర్పడిందని హరీష్ రావు ఆందోళన వ్యక్తం చేశారు. ఇతర రాష్ట్రాల కేంద్రాల్లో ఎస్ఎస్సి జెఈ పరీక్ష రాసే అభ్యర్థులు అదే రోజు వెంటనే తిరిగొచ్చి ఎఈఈ పరీక్ష రాయడం ఏవిధంగా సాధ్యమవుతుందని హరీశ్ రావు ప్రశ్నించారు.ఏళ్ల తరబడి రాత్రింబవళ్లు కష్టపడి సిద్ధమైన రెండు ప్రధాన పోటీ పరీక్షల్లో ఏదో ఒకదాన్ని వదులుకోవాల్సిన దుస్థితికి నిరుద్యోగ యువత గురవుతోందని లేఖలో సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు పేర్కొన్నారు. ఈ పరీక్షల తేదీలను మార్చాలని అభ్యర్థులు పలుమార్లు విజ్ఞప్తులు చేసినప్పటికీ టిజిపిఎస్‌సి ఏమాత్రం స్పందించకపోవడం విచారకరం అన్నారు. స్వయంగా రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కూడా అక్టోబర్ 14నే పరీక్ష తేదీలను పునఃపరిశీలించాలని టిజిపిఎస్‌సి కి లేఖ రాసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. నిరుద్యోగ యువత కోరుతున్నది ఉద్యోగ నియామకాలు ఆపాలని కాదని, కేవలం 2 పోటీ పరీక్షలు రాసేందుకు వీలుగా సమయం కేటాయించి అవకాశం కల్పించాలని మాత్రమేనని స్పష్టం చేశారు. ఒడిశా, బిహార్ వంటి ఇతర రాష్ట్రాల్లో జాతీయ పరీక్షల ఆధారంగా స్థానిక పరీక్షల తేదీలను రీషెడ్యూల్ చేసినప్పుడు తెలంగాణలో ఎందుకు సాధ్యం కాదని హరీశ్ రావు ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి భేషజాలకు పోకుండా నిరుద్యోగ యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తక్షణమే జోక్యం చేసుకుని, నవంబర్ 6న జరగనున్న టిజిపిఎస్‌సి ఎఈఈ (సివిల్) పరీక్షను వాయిదా వేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే భవిష్యత్తులో ఉద్యోగ ప్రకటనలు, పరీక్ష తేదీల నిర్వహణలో ఇలాంటి గందరగోళం పునరావృతం కాకుండా ప్రభుత్వం, టీజీపీఎస్సీ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# "హిట్ అండ్ రన్" రాజకీయాలు చేస్తున్నారు

బాటిళ్లు, మారణాయుధాలు లభించాయని తెలిపారు. కడప, పుంగనూరు, రాయచోటి, కనిగిరి, దర్శి, తంబళ్లపల్లె, తిరుపతి వంటి వేర్వేరు ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ తీవ్ర అరాచకం సృష్టించిందని, రాష్ట్రం తగులబడిపోయినా పరవాలేదు కానీ తమ రాజకీయ అజెండా నెగ్గాలనే కుట్రపూరిత ఆలోచనతోనే ఇదంతా చేశారని దుయ్యబట్టారు.

### పులివెందులలో ఆ స్థాయిలో ఏకగ్రీవాలా

'మీడియా ముందుకొచ్చి ఏడవటం కాదు జగన్ ముందు నిజాలు తెలుసుకుని మాట్లాడు. గతంలో పులివెందుల స్థానిక ఎన్నికల్లో 33 స్థానాలకు 33 ఏకగ్రీవం అయ్యాయి. ఇది దౌర్జన్యంగా చేయడం కాదా?. కడప జిల్లాలో 76 శాతం ఏకగ్రీవాలు చేశారు. దీనికి ఎవరు బాధ్యులు. నా నియోజకవర్గంలో ఎప్పుడూ ఇలాంటి పని చేయలేదు. చిత్తూరు జిల్లాలో గతంలోనూ, నేడు మొత్తం ఏకగ్రీవాలు కాలేదు. కడపలో 79 శాతం ఎంపీటీసీలు ఏకగ్రీవం. కేవలం 21 చోట్ల మాత్రమే ఎన్నికలు జరిగాయి. జెడ్పీటీసీలు 76 శాతం ఏకగ్రీవం చేసుకున్నారు. దీనిపై స్పందించిన తరువాతే జగన్ ప్రస్తుత పరిస్థితులపై మాట్లాడాలి.

### వైసీపీ హయాంలో ఎంపీటీసీలు 24 శాతం, జెడ్పీటీసీలు 19 శాతం ఏకగ్రీవాలు

ఇన్నేళ్ల చరిత్రలో పులివెందులలో ప్రజలు స్వేచ్ఛగా ఓట్లు వేసిన పరిస్థితి ఉందా కుప్పంలో ఎప్పుడూ స్వేచ్ఛగా ఓట్లు వేస్తున్నారు. ఓట్లు పెరుగుతాయి, కొన్నిసార్లు విభేదిస్తే తగ్గుతాయి. వైసీపీ హయాంలో 24 శాతం 2362 ఎంపీటీసీలు ఏకగ్రీవం కాగా, జెడ్పీటీసీలు 19 శాతం అంటే 126 చోట్ల ఏకగ్రీవాలు అయ్యాయి. అంతకుముందు మా ప్రభుత్వం కేవలం ఒక్క స్థానంలో ఏకగ్రీవం జరిగింది. విశ్వసనీయత కోసం వివరాలు బయటపెడుతున్నాం. 500 సార్లు కోర్టుల్లో వాయిదాలు తెచ్చుకున్నావు. నిజాయితీ ఉంటే నిరూపించుకోవాలని' సీఎం చంద్రబాబు ఘాటు వ్యాఖ్యలు చేశారు.

### పంజాబ్ నుంచి కిరాయి ముఠాలు తీసుకొచ్చిన వైసీపీ!

ఈ ఎన్నికల్లో ప్రజలను, అభ్యర్థులను భయభ్రాంతులకు గురిచేయడానికి ఏకంగా పంజాబ్ రాష్ట్రం నుంచి కిరాయి ముఠాలను తీసుకువచ్చారని చంద్రబాబు పేర్కొన్నారు. కనిగిరిలోని నామినేషన్ కేంద్రంలోకి వెళ్లి నామినేషన్ పత్రాలను లాక్కున్నారని, తంబళ్లపల్లెలో జనసేన కార్యాలయంపై భౌతిక దాడులకు తెగబడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతటితో ఆగకుండా ఒక మాజీ ఎమ్మెల్యే కూతురు బురఖా వేసుకుని మరీ నామినేషన్ కేంద్రంలోకి ప్రవేశించి నామినేషన్ పత్రాలను లాక్కొచ్చారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అనేక చోట్ల వైసీపీ శ్రేణులు దాడులు చేసి వాహనాలను దగ్ధం చేస్తూ తీవ్ర హింసాత్మక ఘటనలకు పాల్పడ్డాయని, ఈ అరాచకాలపై సమాజంలోనూ, ప్రజల్లోనూ విస్తృత చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు.

ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు, నిబంధనల ప్రకారమే కూటమి ప్రభుత్వం పారదర్శకంగా పనిచేస్తోందని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. అయితే, రాష్ట్ర ప్రతిష్టను దెబ్బతీయాలనే దురుద్దేశంతో వైఎస్సార్‌సీపీ ఫేక్ ప్రచారాలకు తెగబడుతోందని, తమ సొంత మీడియా వేదికగా దుష్ప్రచారం చేస్తుందని మండిపడ్డారు. హింసకు పాల్పడేది వాళ్లే, మళ్లీ బాధితుల్లా నటించి కోర్టుల్లో పిటిషన్లు వేసేది కూడా వాళ్లేనని, ఇదేం అరాచకమని ప్రశ్నించారు.గతంలో సొంత బాబాయిని చంపేసి తనపై ఫేక్ ప్రచారం చేశారని, ఇప్పుడు కూడా అదే పాత తంతూ రిపీట్ చేస్తూ తప్పుడు ప్రచారాలతో కోర్టుల్లో పిటిషన్లు వేస్తున్నారని ధ్వజమెత్తారు. కోర్టులకెళ్లి తప్పుడు లిటిగేషన్లు వేస్తూ క్రిమినల్ లిటిగెంట్లుగా తయారయ్యారని, హైకోర్టుతో పాటు సుప్రీం కోర్టును కూడా తప్పుడు సమాచారంతో దారి మళ్లించే ప్రయత్నం చేశారని ఆరోపించారు. సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకారం ఏపీ ఎస్ఈసీ జారీ చేసే ఉత్తర్వులను సంపూర్ణంగా అనుసరిస్తామని కూటమి పార్టీల తరపున ఇప్పటికే అధికారిక ప్రకటన విడుదల చేశామని గుర్తుచేశారు. తాము ప్రజాస్వామ్య వ్యవస్థలను గౌరవిస్తూ పనిచేస్తామని, అయితే రాజకీయ పార్టీగా వైసీపీ చేసే అరాచకాలను ఉపేక్షిస్తే రాష్ట్రంలో రౌడీ రాజ్యం వస్తుందని సీఎం చంద్రబాబు హెచ్చరించారు.

### బ్యారేజీల పునరుద్ధరణలో

# రాజకీయ దురుద్దేశం లేదు




ఆయన మాట్లాడారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, ఎస్ఎల్‌బీసీ, సీతారామ తదితర ప్రాజెక్టులను పూర్తిచేసి ఉంటే ప్రస్తుత కరువు పరిస్థితుల్లో రైతుల కష్టాలు తగ్గేవని పేర్కొన్నారు. మూడు బ్యారేజీలను వినియోగించకుండానే తమ ప్రభుత్వం రికార్డు స్థాయిలో వరి సాగు, ధాన్యం కొనుగోళ్లు సాధించిందని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

### మూడు బ్యారేజీల వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే బీఆర్ఎస్ విషప్రచారం

'మూడు బ్యారేజీల వైఫల్యాలను కప్పిపుచ్చేందుకే బీఆర్ఎస్ విషప్రచారం చేస్తున్నారు. ఎల్‌నినోనూ రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటున్నారు, గోబెల్స్‌ను మించిపోయారు. పదేళ్లలో ప్రాజెక్టులు పూర్తిచేసి ఉంటే రైతులపై కరువు దెబ్బ తగ్గేది'అని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పుకొచ్చారు.'మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల వైఫల్యాలను కప్పిపుచ్చేందుకే బీఆర్ఎస్ నేతల విషప్రచారం. మేడిగడ్డ దెబ్బతిన్నది బీఆర్ఎస్ హయాంలోనే తమ ఘోర వైఫల్యాలను దాచేందుకే ఇప్పుడు నాటకాలు. ఎల్‌నినో పరిస్థితులను కూడా తమకు అనుకూలంగా మలుచుకునేందుకు బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోంది. అబద్ధాల ప్రచారంలో జోసెఫ్ గోబెల్స్‌ను మించిపోయిన కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు'అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు.

### మేడిగడ్డలో డిజైన్ లోపం

'మేడిగడ్డలో డిజైన్, నిర్మాణం, నిర్వహణ లోపాలను గత ప్రభుత్వ హయాంలోనే ఎన్‌డీఎస్ఏ గుర్తించింది. పేలవమైన డిజైన్, పేలవమైన నిర్మాణం మూడు బ్యారేజీల దుస్థితికి గత ప్రభుత్వ వైఫల్యాలే కారణం. బ్యారేజీల డిజైన్, నిర్మాణ వైఫల్యాలను సాంకేతిక, న్యాయ విచారణలు, విజిలెన్స్ నివేదికలు స్పష్టం చేశాయి'అని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ధ్వజమెత్తారు.'తమ హయాంలో జరిగిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు తెలంగాణ రైతాంగాన్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారు.బీఆర్ఎస్ విషపూరిత ప్రచారాన్ని తెలంగాణ ప్రజలు, రైతులు నమ్మడం లేదు. తెలంగాణ సాగునీటి రంగాన్ని సర్వనాశనం చేసింది కేసీఆర్ కంపెనీయే'అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు.

### గత ప్రభుత్వ వైఫల్యాలతోనే ప్రజలకు కష్టాలు

'అవినీతి, కక్కుర్తి కోసం తెలంగాణ ప్రజలను, రైతాంగాన్ని బలి చేసి ఇప్పుడు మళ్లీ నాటకాలు ఆడుతున్నారు. కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, ఎస్ఎల్‌బీసీ, సీతారామ పూర్తిచేసి ఉంటే రైతులకు కరువు కష్టాలు తగ్గేవి'అని జలవనరుల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అభిప్రాయపడ్డారు.'పదేళ్లలో తెచ్చిన అప్పులను సద్వినియోగం చేసి ఉంటే రైతులపై ఎల్‌నినో దెబ్బ ఇంతగా పడేది కాదు. ఎల్‌నినో ప్రతికూల ప్రభావం ప్రజలు, రైతులపై ఎక్కువగా పడటానికి గత ప్రభుత్వ వైఫల్యాలే కారణం'అని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు.

### గోదావరి బేసిన్‌లో రికార్డు స్థాయిలో సాగునీరు

'ప్రాణహిత––చేవెళ్ల, దేవాదుల తదితర ప్రాజెక్టులు పూర్తిచేసి ఉంటే కరువు పరిస్థితులను మరింత సమర్థంగా ఎదుర్కొనేవాళ్లం. పాలమూరు, సీతారామ ప్రాజెక్టులతో ఎన్ని ఎకరాలకు నీరిచ్చారు? ఎస్ఎల్‌బీసీ సొరంగాన్ని ఎందుకు పూర్తిచేయలేదు?'అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నిలదీశారు. ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టును మార్చి తెలంగాణ రైతాంగానికి తీవ్ర అన్యాయం చేశారు అని మండిపడ్డారు. 'మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల నిరుపయోగంగా ఉన్నా రికార్డు వరి సాగు, ధాన్యం కొనుగోళ్లు సాధించాం. మూడు బ్యారేజీలను వినియోగించకుండానే గోదావరి బేసిన్‌లో రికార్డు స్థాయిలో సాగునీరు అందించాం'అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

### మూడు బ్యారేజీల పునరుద్ధరణకు డిజైన్ల రూపకల్పన

'మా రెండున్నరేళ్ల పాలనలో కృష్ణా, గోదావరి బేసిన్లలో సాగు విస్తీర్ణం, పంట ఉత్పత్తి పెరిగాయి. సీఎం రేవంత్‌రెడ్డి,డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలో వరి సాగు, ధాన్యం కొనుగోళ్లలో రికార్డులు నమోదయ్యాయి. బ్యారేజీల గేట్లు ఎత్తి ఉంచాలని డ్యామ్ సేఫ్టీ అథారిటీ లిఖితపూర్వకంగా సూచించింది'అని జలవనరుల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. 'మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల పునరుద్ధరణకు దేశీయ, అంతర్జాతీయ నిపుణుల సలహాలతో ముందుకెళ్తున్నాం. మూడు బ్యారేజీల పునరుద్ధరణకు నిపుణుల ఆధ్వర్యంలో డిజైన్ల రూపకల్పన జరుగుతోంది'అని జలవనరుల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

### బ్యారేజీల పునరుద్ధరణలో రాజకీయ దురుద్దేశం లేదు

'బ్యారేజీల పునరుద్ధరణలో రాజకీయ దురుద్దేశం లేదు, చిత్తశుద్ధితో పనిచేస్తున్నాం. గత ప్రభుత్వ ఘోర వైఫల్యాలను కప్పిపుచ్చే ప్రచారం వెనుక వాస్తవాలను తెలంగాణ రైతాంగం గమనించాలి'అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచించారు. ఈ సమావేశంలో మంత్రి జి. వివేక్, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య యాదవ్, ఎమ్మెల్యేలు కుంభం అనిల్ రెడ్డి, బాలు నాయక్, మందుల సామ్యేల్, సంజీవ్ రెడ్డి, నీటిపారుదల శాఖ ఇంజినీరింగ్ సలహాదారు పరిక్షిత్ మెహ్రా, ఈఎన్‌సీ రమేష్‌బాబు తదితర అధికారులు పాల్గొన్నారు.

### హైదరాబాద్ జూకు వంతారా నుంచి

# కంగారూలు, లెమూర్ల రాక!

**హైదరాబాద్ :** హైదరాబాద్ నగరవాసులకు, ముఖ్యంగా వన్యప్రాణి ప్రేమికులకు నెహ్రూ జూలాజికల్ పార్క్ సరికొత్త జీవులను అందుబాటులోకి తీసుకురావడానికి ఏర్పాట్లు చేసింది. గుజరాత్‌లోని జామ్‌నగర్‌కు చెందిన ప్రముఖ గ్లోబల్ వైల్డ్‌లైఫ్ రెస్క్యూ , కన్జర్వేషన్ సెంటర్ వంతారా నుంచి విదేశీ రకాలకు చెందిన అరుదైన జంతువులను నగరానికి తీసుకొచ్చేందుకు జూ అధికారులు ప్రణాళికలను వేగవంతం చేశారు. ఆస్ట్రేలియా దేశానికి చెందిన సంకేతమైన కంగారూలు , వాలబీలు , మడగాస్కర్ మూలాలున్న రింగ్–టెయిల్డ్ లెమూర్లు, కాసోవారీ రకం పక్షులు త్వరలోనే నెహ్రూ జూ పార్క్‌లో సందడి చేయనున్నాయి. జూ చరిత్రలోనే తొలిసారిగా ఒక ఆడ, మగ కంగారూలను ప్రదర్శనగా ఉంచేందుకు ప్రత్యేక ఎన్‌క్లోజర్లను, నైట్ హౌస్‌లను అధికారులు సిద్ధం చేశారు. గతంలో 2020లో జపాన్‌లోని యోకోహామా జూలాజికల్ గార్డెన్స్ నుంచి నాలుగు కంగారూలను తీసుకురావడానికి ఒప్పందం కుదిరినప్పటికీ, కరోనా మహమ్మారి విజృంభణ వల్ల ఆ ప్రతిపాదన కార్యరూపం దాల్చలేదు. ఇప్పుడు వంతారా బృందం స్వయంగా హైదరాబాద్ జూలోని వసతులను, మౌలిక సదుపాయాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, జంతువుల తరలింపునకు సూత్రప్రాయంగా అంగీకారం తెలిపింది.

ప్రస్తుతం అక్కడి పునరావాస పనులు పూర్తయిన వెంటనే వీటిని నగరానికి తరలించనున్నారు.కంగారూలతో పాటు వాటిని పోలి ఉండే దాదాపు 3 అడుగుల ఎత్తు ఉండే వాలబీలు , మడగాస్కర్ ప్రాంతానికి చెందిన విశిష్టమైన రింగ్–టెయిల్డ్ లెమూర్లు జూ సందర్శకులను ఆకట్టుకోనున్నాయి. నలుపు , తెలుపు చారల పొడవైన తోకలు కలిగిన ఈ లెమూర్లు ఉదయాన్నే శరీర వేడి కోసం చేతులు చాచి నిటారుగా కూర్చునే వినూత్న ప్రవర్తనకు ప్రసిద్ధి చెందాయి. వీటికి తోడుగా, జూలోని జీబ్రాల సంఖ్యను మరింత పెంచేందుకు మరో జత జీబ్రాలను కూడా వంతారా నుంచి తీసుకురానున్నారు. ప్రస్తుతం జూలో ఉన్న ముగ్గురు జీబ్రాలు రెండు మగ, ఒక ఆడ కూడా గతంలో వంతారా నుంచే తీసుకువచ్చారు. మరోవైపు, దేశంలో ఎల్ నినో ప్రభావం, పెరుగుతున్న పగటి ఉష్ణోగ్రతల నుంచి జూలో ని మూగజీవాలను కాపాడేందుకు జూ యాజమాన్యం ముందస్తు జాగ్రత్తలు చేపట్టింది. ప్రస్తుతం ఉన్న 2,178 జీవుల 498 క్షీరదాలు, 320 సరిస్పృపాలు, 8 ఉభయచరాలు , పక్షులు సంరక్షణ కోసం ఎన్‌క్లోజర్ల వద్ద వాటర్ స్ప్రింక్లర్లు, ఫాగర్లు, కూలర్లు , ఎయిర్ కండిషనర్లను ఏర్పాటు చేశారు. ఎండ వేడిమి నుంచి జంతువులకు ఉపశమనం కలిగిస్తూనే, కొత్త అతిథుల కోసం ప్రత్యేక వాతావరణాన్ని అధికారులు తీర్చిదిద్దుతున్నారు.కొత్తగా రానున్న ఈ విదేశీ వన్యప్రాణులతో నెహ్రూ జూలాజికల్ పార్క్ మరింత సందడిగా మారడంతో పాటు నగర పర్యాటకానికి పెద్ద ఎత్తున ఆకర్షణగా నిలవనుంది. జూ అధికారుల సమాచారం ప్రకారం.. వంతారా అధికారులతో మిగిలిన అధికారిక ప్రక్రియలను వేగంగా పూర్తి చేసి, రాబోయే కొన్ని వారాల్లోనే ఈ కొత్త అరుదైన అతిథులను సాధారణ సందర్శకుల ప్రదర్శన కోసం అందుబాటులోకి తేనున్నారు.

## స్వర్ణకార శంఖారావం సభకు
# బయలుదేరిన వెళ్లిన స్వర్ణకారులు



**రామాయంపేట** మెదక్ జిల్లా రామాయంపేట పట్టణంలోని స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో స్వర్ణకారులు హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో పెద్ద ఎత్తున నిర్వహించే స్వర్ణకార శంఖారావం సభకు టాటా సుమోలలో బయలుదేరి తరలివెళ్లిన స్వర్ణకారులు తమ న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు.ఈ సందర్భంగా మెదక్ జిల్లా స్వర్ణకార సంఘం ప్రధాన కార్యదర్శి సుంకోజు దామోదర్ చారి మాట్లాడుతూ స్వర్ణకారులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి 50 ఏళ్లు పైబడిన స్వర్ణకారులకు పెన్షన్ మంజూరు చేయాలన్నారు.అన్ని బ్యాంకుల్లో జీవో 272ను సవరించాలని అమలవుతున్న కమిషన్ విధానాన్ని రద్దు చేసి దాని స్థానంలో సమాంతర విధానాన్ని అమలు పరచాలన్నారు.

తెలంగాణ రాష్ట్రంలో స్వర్ణకారులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం గుర్తించి అన్ని రంగాల్లో వారికి అండగా నిలవాలన్నారు.స్వర్ణకారుల సంక్షేమం కోసం తమ న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా స్వర్ణకార సంఘం ప్రధాన కార్యదర్శి సుంకోజు దామోదర్ చారి రాష్ట్ర కార్యదర్శి నెమలి శ్రీనివాస్ చారి పట్టణ అధ్యక్షులు కృష్ణాపురం రామకృష్ణ చారి ఉపాధ్యక్షులు పూన రవీందర్ చారి కోశాధికారి మైలవరం వేణు మాధవచారి సహాయ కార్యదర్శి రాయరపు కిరణ్ చారి గౌరవ అధ్యక్షులు ఎల్దీ లక్ష్మీనారాయణ చారి మాజీ ఉపాధ్యక్షులు వంగాల ముకుందం చారి వంగాల బ్రహ్మచారి యాడారం రమేష్ చారి నక్క నరేందర్ చారి మోత్కూరియాదగిరి చారి ముత్యాల మురళి చారి మద్దూరి నవీన్ చారి మల్లేపల్లి శ్రీనివాస్ చారి రాయరపు నాగరాజు చారి కొడపర్తి ధరణి చారి బోరుగోజు సంతోష్ చారి నారోజు భూమయ్య చారి పులిమామిడి భాస్కర్ చారి రాయరపు గోపి గోపీచరి రాయరాపు రవి చారి తదితరులు పాల్గొన్నారు.

## ముదిరాజులను బీసీఏలో చేర్చడంపై
# బీసీ కులాల నిరసన



**రామాయంపేట** మెదక్ జిల్లారామాయంపేట మండల కేంద్రంలో శనివారం బీసీ ఐక్యకులాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా తెలంగాణ తల్లి విగ్రహం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు చాకలి మంగలి కులస్తులు ర్యాలీ చేపట్టారు.అనంతరం మెదక్ రోడ్ లో ఉన్న అంబేద్కర్ చౌరస్తా వద్ద రాస్తారోకో నిర్వహించి తమ నిరసనను వ్యక్తం చేశారు.ముదిరాజ్ కులస్తులను బీసీఏలో చేర్చే నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వారు ఆందోళన చేపట్టారు.ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా అధ్యక్షులు సంగు స్వామి బీసీ కుల నాయకులు మామిడి సిద్ధరాములు మ్యాధరి భాను ఐక్యకులాల నాయకులు చాకలి మంగలి కులస్తులు తదితరులు పాల్గొన్నారు.

## తుగ్గలి ఎంపీటీసీ అభ్యర్థుల
# నామినేషన్ల పరిశీలన పూర్తి

**- 76 మంది బరిలో,ఒక్కటి తిరస్కరణ.**

**- ఎన్నికల రిటర్నింగ్ అధికారి శేషయ్య**



**తుగ్గలి:** తుగ్గలి మండలంలో ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల పరిశీలన ప్రక్రియ శనివారం రోజున పూర్తయినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి శేషయ్య తెలియజేశారు.మండలంలోని వివిధ ఎంపీటీసీ స్థానాలకు మొత్తం 77 నామినేషన్లు దాఖలయ్యాయని,వాటిలో 76 నామినేషన్లను ఆమోదించామని,ఒక నామినేషన్ తిరస్కరించామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి శేషయ్య తెలిపారు.రాంపురం ఎంపీటీసీ స్థానానికి జనసేన పార్టీ తరపున పోటీ చేస్తున్న రామచంద్ర నామినేషన్ లో లోపాలు ఉండటంతో తిరస్కరించినట్లు ఆయన పేర్కొన్నారు.ఆమోదం పొందిన 76 నామినేషన్లలో పార్టీల వారీగా తెలుగుదేశం పార్టీ నుండి 35 మంది,వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నుండి 35 మంది,సీపీఐ పార్టీ నుండి ముగ్గురు,కాంగ్రెస్ పార్టీ నుండి ఒకరు,ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు బరిలో ఉన్నారని ఆయన తెలిపారు.ఉపసంహరణ గడువు తర్వాత తుది అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తామని,ఎన్నికల ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహిస్తున్నామని రిటర్నింగ్ అధికారి శేషయ్య వెల్లడించారు.ఈ కార్యక్రమంలో ఏఆర్ఓ విశ్వమోహన్, రవి తదితరులు పాల్గొన్నారు.

# సిద్దిపేటలో దారుణం..

**- బాలికపై సామూహిక అత్యాచారం.. ఏడుగురి అరెస్ట్**

**మెదక్ :** తెలంగాణలోని సిద్దిపేట జిల్లాలో అత్యంత దారుణమైన ఘటన చోటుచేసుకుంది. 15 ఏళ్ల బాలికపై ఏడుగురు వ్యక్తులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ ఘటనకు సంబంధించి ముగ్గురు మైనర్లు సహా నిందితులందరినీ పోలీసులు అరెస్ట్ చేశారు. వారిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.పోలీసుల కథనం ప్రకారం.. దసరా పండుగ రోజున బాలిక తల్లిదండ్రులు పొలం పనులకు వెళ్లారు. ఇంట్లో ఒంటరిగా ఉన్న బాలికను గమనించిన నిందితులు, ఆమెను కిడ్నాప్ చేసి సమీపంలోని మరో గ్రామానికి తీసుకెళ్లారు. అక్కడ ఆమెపై సామూహిక అత్యాచారానికి ఒడిగట్టారు. మరుసటి రోజు ఉదయం బాధితురాలిని ఆమె గ్రామ సమీపంలో వదిలిపెట్టి వెళ్లిపోయారు. ఇంటికి చేరుకున్న బాలిక జరిగిన దారుణాన్ని తల్లిదండ్రులకు వివరించడంతో, వారు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఫిర్యాదు అందుకున్న వెంటనే పోలీసులు రంగంలోకి దిగారు. మద్దూరు ఎస్పై ఎండి.ఆసిఫ్ తెలిపిన వివరాల ప్రకారం, నిందితులు చెరియాల్ పట్టణం, ధూల్‌మిట్ట గ్రామానికి చెందినవారిగా గుర్తించారు. ఏడుగురినీ అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపర్చగా, న్యాయస్థానం వారికి జ్యుడీషియల్ కస్టడీ విధించింది. నిందితులకు డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా, వారు మాదకద్రవ్యాలు సేవించిన ఆనవాళ్లు కనిపించలేదని పోలీసులు స్పష్టం చేశారు. చట్ట ప్రకారం బాధితురాలు, నిందితుల్లోని మైనర్ల వివరాలను గోప్యంగా ఉంచారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి లోతుగా దర్యాప్తు జరుపుతున్నారు.

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

**- జీజీహెచ్ తనిఖీలో కలెక్టర్ చిత్రా మిశ్రా**



**కరీంనగర్** ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి జీజీహెచ్ కి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ చిత్రా మిశ్రా వైద్య అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కేంద్రంలోని జీజీహెచ్ ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జీజీహెచ్ సూపరింటెండెంట్ వీరారెడ్డి, ఆర్ఎంఓ నవీనతో కలిసి ఆసుపత్రిలోని యూనిట్, ఫిమేల్ వార్డు, ఓపీ, సర్జికల్ తదితర వార్డులను పరిశీలించారు. పేషంట్లతో మాట్లాడి అందిస్తున్న వైద్య సేవల వివరాలు తెలుసుకున్నారు.రోగులకు ఇబ్బంది కలగకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. పనులు నాణ్యతగా చేపట్టడంలో రాజీ పడొద్దు, జీజీహెచ్ లో రోగులకు ఇబ్బంది కలగకుండా అవసరమైన మరమ్మత్తుల కోసం కలెక్టర్ ఇటీవల రూ.50 లక్షలు మంజూరు చేశారు. ఇందులో భాగంగా కొనసాగుతున్న పనుల వివరాలను టీజీఎంఐడీసీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. జరుగుతున్నప్యాచ్ వర్క్ లు, మరుగుదొడ్ల పనులు, గదుల్లో, కిటికీల పనులు, ఇతర మరమ్మతులు పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. పనులను నాణ్యతతో చేపట్టి.. గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.క్రిటికల్ కేర్ సెంటర్ పరిశీలన:గుండె సంబంధిత వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రూ.ఆరున్నర కోట్లతో ఏర్పాటు చేసిన క్యాత్ ల్యాబ్ మిషన్లు ఏర్పాటు చేసిన క్రిటికల్ కేర్ సెంటర్ ను కలెక్టర్ వైద్య అధికారులతో కలిసి సందర్శించారు. వినియోగంలోకి తీసుకొచ్చేందుకు అవసరమైన వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ వీరారెడ్డి, ఆర్ఎంఓ నవీన, వైద్య సిబ్బంది ఉన్నారుమున్సిపల్ ఆధ్వర్యంలో మాతా శిశు ఆరోగ్య కేంద్రం ఆవరణలో రోగుల సహాయకుల కోసం రూ. 35 లక్షలతో ఏర్పాటు చేసే విశ్రాంతి గదుల షెడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మున్సిపల్ అధికారులకు పలు సూచనలు చేశారు.

# అక్రమ బోర్లపై హైడ్రా స్టింగ్ ఆపరేషన్

**హైదరాబాద్** సున్నం చెరువు చెంత అక్రమ బోర్లపై హైడ్రా స్టింగ్ ఆపరేషన్ నిర్వహించింది. అక్రమ నీటి దందాకు చెక్ పెట్టింది. ఇళ్లలో బోర్లు వేసి నీటిని అక్రమంగా తోడేసి దశాబ్దాలుగా జరిగే నీటి దందాకు చెక్ పెట్టింది. సున్నం చెరువు చెంత నివాసాల బోర్ల నుంచి వచ్చిన పైపులను తొలగించింది. రెవెన్యూ, సీఎంసీ అ అధికారుల సమక్షంలో.. పోలీసుల బందోబస్తు మధ్య హైడ్రా భారీ ఆపరేషన్ నిర్వహించింది. ఇళ్లలోంచి వస్తున్న అక్రమ బోర్ల పైపులను తొలగించి చెక్ పెట్టింది. అక్రమ నీటి దందాపై హైడ్రా యాక్షన్.టి దందాకు చెక్ పెట్టింది. ఇళ్లలో బోర్లు వేసి నీటిని అక్రమంగా తోడేసి దశాబ్దాలుగా జరిగే నీటి దందాకు స్వస్తి పలికింది. సున్నం చెరువు చెంత నివాసాల బోర్ల నుంచి వచ్చిన పైపులను తొలగించింది.

## చెల్లుబాటైన నామినేషన్లలో
# టీడీపీ, వైసీపీ హవా

**- చెల్లుబట్టైన నామినేటర్ల అభ్యర్థుల జాబితా విడుదల**

**ఆత్మకూరు :**టీడీపీకి 20, వైసీపీకి 20, బీజేపీకి 2, జనసేనకు 1 నామినేషన్‌చెల్లు బాటైన నామినేటర్ల అభ్యర్థుల జాబితా ప్రకారం మొత్తం 10 ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి 43 నామినేషన్లు నమోదయ్యాయి. ఇందులో తెలుగుదేశం పార్టీ (టీడీపీ), వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైసీపీ) సమానంగా 20 చొప్పున నామినేషన్లతో నిలిచాయి. బీజేపీ నుంచి 2, జనసేన పార్టీ నుంచి 1 నామినేషన్ నమోదైంది.గ్రామాల వారీగా నామినేషన్ల వివరాలుకరివెన: టీడీపీ 2, వైసీపీ 2 ? మొత్తం 4.కురుకుంట–1: టీడీపీ 2, వైసీపీ 2 ? మొత్తం 4.కురుకుంట–2: టీడీపీ 2, వైసీపీ 1 ? మొత్తం 3.కృష్ణాపురం: బీజేపీ 2, టీడీపీ 2, వైసీపీ 2 ? మొత్తం 6.నల్లకాల్వ: టీడీపీ 2, వైసీపీ 2 ? మొత్తం 4.ముస్టేపల్లి: టీడీపీ 4, వైసీపీ 2 ? మొత్తం 6.పిన్నాపురం: టీడీపీ 2, వైసీపీ 2 ? మొత్తం 4.శ్రీపతిరావుపేట: టీడీపీ 2, వైసీపీ 2 ? మొత్తం 4.సిద్దాపురం: టీడీపీ 2, వైసీపీ 2 ? మొత్తం 4.వడ్లరామాపురం: వైసీపీ 3, జనసేన 1 ? మొత్తం 4.రాజకీయంగా ఆసక్తికరంగా మారిన పోటీగ్రామాల వారీగా పరిశీలిస్తే, కృష్ణాపురం, ముస్టేపల్లి గ్రామాల్లో అత్యధికంగా ఆరు నామినేషన్లు నమోదయ్యాయి. పది స్థానాలకు సంబంధించి టీడీపీ, వైసీపీ సమాన సంఖ్యలో నామినేషన్లు దాఖలు చేయడం రాజకీయంగా ఆసక్తికరంగా మారింది.

# కరవుపై కార్యాచరణ

**హైదరాబాద్:** ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో ఏర్పడుతున్న కరవు పరిస్థితులను ఎదుర్కొనేం దుకు ప్రభుత్వం సమగ్ర కార్యాచరణకు సిద్ధమవుతోంది. తాగునీరు, సాగునీటి లభ్యతను కాపాడటంతోపాటు విద్యుత్ సరఫరా, వ్యవసాయం, గ్రామీణ ఉపా ధి రంగాల్లో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ముం దస్తు చర్యలు చేపట్టాలని నిర్ణయించింది.కరవు ప్రభావిత మండలాలను శాస్త్రీయంగా గుర్తించి, అర్హత కలిగిన ప్రాంతాలను నిబంధనల ప్రకారం ప్రకటించే ప్ర క్రియను ఈ నెల 31లోగా పూర్తి చేయాలని ఉప ము ఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగిన కేబినెట్ సబ్‌కమిటీ సమావేశం నిర్ణయించింది. కరవు, ఎల్‌ని నో పరిస్థితులపై చర్చించేందుకు త్వరలో అఖిలపక్ష స మావేశం నిర్వహించాలని కూడా తీర్మానించింది. సచివాలయంలో శుక్రవారం జరిగిన కేబినెట్ సబ్‌కమిటీ సమావేశంలో రాష్ట్రంలో కరవు తీవ్రత, నీటి వనరుల లభ్యత, రైతులకు అందించాల్సిన సహాయం, ప్రత్యామ్నాయ పంటల సాగు, విద్యుత్ సరఫరా, గ్రామీణ ఉ పాధి తదితర అంశాలపై చర్చించారు.కరవు ప్రభా వం వివిధ రంగాలపై ఎలా ఉండబోతోందో ముందుగానే అంచనా వేసి, ప్రతి శాఖ తన పరిధిలో చేపట్టాల్సి న చర్యలపై స్పష్టమైన ప్రణాళిక రూపొందించాలని భ ట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. సమస్యలు తీవ్రరూపం దాల్చిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే నివారణ చర్యలు చేపట్టడం ముఖ్యమని పేర్కొన్నారు.రాష్ట్రంలో తక్కువ వర్షపాతం, పంటల సాగు విస్తీర్ణం తదితర ప్రమాణాలను పరిగణనలోకి తీసుకొని ప్రాథమికంగా 358 మండలాల్లో కరవు ప రిస్థితులు ఉన్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజ య్ జాజు తెలిపారు. మొత్తం 33 జిల్లాలకు గాను 18 జిల్లాల్లో కనిష్ఠ వర్షపాతం నమోదుకాగా, 15 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైందని వివరించారు. 324 మండలాల్లో భూగర్భ జలమట్టాలు ఆందోళనకర స్థాయిలో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ నెల 31లోగా కరువు మండలాల జాబితాను కేంద్ర ప్రభుత్వానికి సమర్పిస్తామని తెలిపారు. ఇప్పటికే ప్రతి జిల్లా కలెక్టర్‌కు అత్యవసర నిధుల కింద రూ.1 కోటి విడుదల చేసినట్లు వెల్లడించారు.

# జడ్పీ పీఠమే లక్ష్యంగా
## ఇద్దరు జనసేన అభ్యర్థుల నామినేషన్

**రాజమహేంద్రవరం.** తూర్పుగోదావరి జడ్పీ పీఠం జనరల్ మహిళకు కేటాయించడంతో పోటీ ఆసక్తికరంగా మారింది. అభ్యర్థులు ఎవరన్నది పార్టీల నుంచి అధికారికంగా ప్రకటన రాకున్నా ఎవరికి వారు తమకున్న పరిచయాలతో ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు.రాజానగరం జనసేన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సతీమణి బత్తుల వెంకటలక్ష్మి సీతానగరం మండల జడ్పీటీసీ అభ్యర్థిగా గురువారం నామినేషన్ వేశారు. తాజాగా అదే పార్టీకి చెందిన రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) మాజీ డైరెక్టర్ గంటా స్వరూపారాణి సీతానగరంతో పాటు కొవ్వూరు జడ్పీటీసీ అభ్యర్థిగా శుక్రవారం నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు.

బత్తుల వెంకటలక్ష్మి, గంటా స్వరూపారాణి జిల్లాలో కూటమి సర్దుబాట్లలో భాగంగా సీతానగరం జనసేనకు, కొవ్వూరు జడ్పీటీసీని తెదేపాకు కేటాయించారు. ఈ లెక్కన సీతానగరం మండలం నుంచి జనసేనకు చెందిన ఇద్దరు మహిళా నేతలు బరిలోకి దిగుతున్నట్లుయింది. ఎవరి అభ్యర్థిత్వాన్ని అధిష్టానం ఖరారు చేస్తుందోనన్న చర్చ సాగుతోంది.పార్టీ ఆదేశాల మేరకే నామినేషన్లు వేసినట్లు ఎవరికివారు చెబుతున్నారు. ఇద్దరి అభ్యర్థిత్వాలపై ఆ పార్టీ ఏబీఆర్ఎస్ ద్వారా అభిప్రాయాలు సేకరిస్తోంది. మరోవైపు ఏపీటీడీసీ డైరెక్టర్ పదవికి స్వరూపారాణి చేసిన రాజీనామాను ప్రభుత్వం శుక్రవారం ఆమోదించింది.

## సింహాచలంలో ముగిసిన
# దుర్గాదేవి మహోత్సవాలు

**- 14 రోజుల పాటు విశేష పూజలు, అభిషేకాలు**

**- భారీగా అన్నసమారాధన.. వైభవంగా జగన్మాత నిమజ్జనోత్సవం**

**సింహాచలం:** సింహాచలంలోని శ్రీ గణేష్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో 14 రోజుల పాటు నిర్వహించిన దుర్గాదేవి మహోత్సవాలు శనివారం అత్యంత వైభవంగా ముగిశాయి. సంఘం అధ్యక్షుడు, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి, సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి మాజీ సభ్యుడు, ప్రత్యేక ఆహ్వానితుడు గంట్ల శ్రీనుబాబు ఆధ్వర్యంలో ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.మహోత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ జగన్మాత దుర్గాదేవికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని వివిధ అలంకరణలతో కొలుస్తూ భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉత్సవాల్లో భాగంగా భక్తులకు భారీ ఎత్తున అన్నసమారాధన చేపట్టారు.ఉత్సవాల ముగింపు సందర్భంగా శనివారం సాయంత్రం జగన్మాత నిమజ్జనోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. వివిధ రకాల వేషధారణలు, భక్తుల కోలాహలం, జయజయధ్వానాల నడుమ అమ్మవారి ఊరేగింపు ఉత్సాహంగా సాగింది. అనంతరం సంప్రదాయబద్ధంగా నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ మహోత్సవాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు, గ్రామ ప్రజలు పాల్గొని జగన్మాతను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. 14 రోజుల పాటు కొనసాగిన ఆధ్యాత్మిక కార్యక్రమాలు, అన్నసమారాధన, నిమజ్జనోత్సవంతో సింహాచలంలో పండుగ వాతావరణం నెలకొంది. భక్తుల సహకారంతో మహోత్సవాలు విజయవంతంగా ముగిశాయి.

## ఆదివారం 3 గంటల తర్వాత
# అభ్యర్థుల పేర్లు, గుర్తుల విడుదల

**నంద్యాల** మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్ అభ్యర్థుల పేర్లు, వారికి కేటాయించిన ఎన్నికల గుర్తులను ఆదివారం మధ్యాహ్నం 3 గంటల తర్వాత విడుదల చేయనున్నట్లు మున్సిపల్ చైర్మన్ ఎన్నికల అధికారి సంజయ్ కుమార్ వెల్లడించారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.అభ్యర్థుల పేర్లు, గుర్తుల విడుదల అనంతరం చైర్మన్ పదవికి పోటీ చేస్తున్న అభ్యర్థులతో మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు సంజయ్ కుమార్ తన ప్రకటనలో స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన కీలక అంశాలపై అభ్యర్థులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.ముఖ్యంగా ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల జాబితా అందజేత, వాహన పాసుల జారీ, పోలింగ్ కేంద్రాల్లో ఏజెంట్ల నియామక విధానం తదితర అంశాలను అభ్యర్థులకు వివరించనున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల నిబంధనలు, విధివిధానాలపై పూర్తి అవగాహన కల్పించి, ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు అవసరమైన సమాచారాన్ని అందించనున్నట్లు ఎన్నికల అధికారి సంజయ్ కుమార్ తెలిపారు.

# జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల
# ఏర్పాట్లపై సమీక్ష

**- అధికారులు సమన్వయంతో పనిచేయాలి**

**- జాయింట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్**



**రంపచోడవరం** పోలవరం జిల్లాలో జరగనున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలను సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. ప్రశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు.శనివారం రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయంలోని జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ ఆధ్వర్యంలో సంబంధిత అధికారులతో ఎన్నికల ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రంపచోడవరం సబ్ కలెక్టర్ డి. పృథ్వీ రాజ్ కుమార్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల విధులకు అవసరమైన సిబ్బందిని కేటాయించాలని, పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలను పరిశీలించాలని సూచించారు. బ్యాలెట్ బాక్సులు, ఇతర ఎన్నికల సామగ్రిని ముందుగానే సిద్ధం చేసుకోవాలని తెలిపారు.రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ, ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి స్పష్టమైన సూచనలు ఇవ్వాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, తమకు అప్పగించిన బాధ్యతలను సకాలంలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో నోడల్ అధికారులు డీఆర్వో శివరావు, డీపీఓ జి. భాస్కరరావు, డ్వామా పీడీ రామ్ ప్రసాద్, డీడీఓ మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సమరానికి
# కూటమి కసరత్తు

**- ఎంపీటీసీ, జెడ్పీటీసీ అభ్యర్థులపై కీలక చర్చలు**



**నంద్యాల** స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి విజయమే లక్ష్యంగా తెలుగుదేశం, బీజేపీ నాయకులు సమన్వయంతో ముందుకు సాగుతున్నారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఎంపిక, పార్టీ శ్రేణుల సమన్వయం, ఎన్నికల వ్యూహాలపై దృష్టి సారించారు.టీడీపీ జిల్లా సమన్వయ బాధ్యుడు వైకుంఠం ప్రభాకర్ చౌదరిని బీజేపీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు, బీజేపీ నాయకులతో కలిసి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థుల వివరాలు, ఆయా ప్రాంతాల్లో పార్టీ పరిస్థితులు, అభ్యర్థుల బలాబలాలపై చర్చించినట్లు తెలిసింది.కూటమి పార్టీల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడం, అభ్యర్థుల ఎంపికలో స్థానిక పరిస్థితులకు ప్రాధాన్యం ఇవ్వడం, ఎన్నికల్లో విజయావకాశాలను మెరుగుపరచుకునే అంశాలపై నాయకులు చర్చించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి బలాన్ని చాటేందుకు టీడీపీ, బీజేపీ నాయకులు పరస్పర సహకారంతో ముందుకు సాగుతున్నట్లు ఈ భేటీ స్పష్టం చేస్తోంది.

# ఎంఎల్సీ ఎన్నికల్లో బీజేపి అభ్యర్థిగా పోటీ చేసేందుకు అవకాశమివ్వండి

**బీజేపి ఇంటలెక్చ్యుల్ కన్వీనర్ పి. వెంకటేశ్**



హైదరాబాదు (ప్రశ్న న్యూస్) భారతీయ జనతా పార్టీతో తనకున్న ముప్పై ఏళ్ల అనుబంధం, విధేయత, బీసీ ఉద్యమాల పట్ల తనకున్న నిబద్ధతను పరిగణనలోకి తీసుకొని మహబుబ్‌నగర్–రంగారెడ్డి ఎంఎల్సీ స్థానానికి జరగనున్న ఎన్నికల్లో బీసీ సామాజిక వర్గానికి చెందిన తనకు బీజేపి అభ్యర్థిగా పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలని బీజేపి ఇంటలెక్చ్యుల్ కన్వీనర్, సంగారెడ్డి హైదరాబాద్ మేథో కమిటీ సభ్యులు పి. వెంకటేష్ కోరారు. ఈ మేరకు శనివారం నాడు రాష్ట్ర బీజేపి అధ్యక్షులు రాంచందర్ రావును కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతు విద్యార్థి దశలోనే బీజేపి సిద్ధాంతాలకు ఆకర్శితుడినైన తాను క్షేత్రస్థాయిలో పార్టీ పట్ల విధేయత, నిబద్ధతతో పార్టీ బలోపేతం కోసం నిర్విరామంగా పని చేస్తునట్లు తెలిపారు. ఆర్ఎస్ఎస్, ఏబివిపిలో కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడమే కాక ఆల్విన్ కంపెనీలో బిఎంఎస్ యూనియన్ నాయకునిగా పనిచేసినట్లు తెలిపారు. అలాగే సంస్థాగత, సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు తెలంగాణ ఉపాధ్యాయ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షునిగా బాధ్యతలు నిర్వహించినట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో బీసీ సంక్షేమం, విద్యార్థి ఉద్యమాలు, కార్మిక సమస్యలు, విద్యా, సామాజిక సేవా, ప్రజా సంక్షేమం వంటి అంశాలపై పార్టీ ఆధ్వర్యంలో అవిశ్రాంతంగా పనిచేస్తు గడప గడపకూ పార్టీ ఆశయాలు చేరేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. దాదాపు మూడు దశాబ్దాలుగా పార్టీ పట్ల విధేయత, విశ్వాసం, నిబద్ధతతో పనిచేస్తు జాతీయ బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య ఆధ్వర్యంలో బీసీ ఉద్యమాల్లో చురుకుగా పాల్గొంటు బీసీ సామాజిక వర్గ సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తుండటమే కాకుండా స్వతహాగా బీసీ సామాజిక వర్గానికి చెందిన తన సేవలను పరిగణనలోకి తీసుకుని మహబుబ్‌నగర్–రంగారెడ్డి ఎంఎల్సీ ఎన్నికల్లో బీజేపి అభ్యర్థిగా పోటీకి అవకాశం కల్పించాలని రాష్ట్ర బీజేపి నాయకత్వాన్ని అభ్యర్థించారు. అలాగే బీజేపి పార్లమెంటు సభ్యులు డి కే అరుణ, కొండ విశ్వేశ్వరరెడ్డిలను కలిసి మద్దతు కోరారు.

# బంగాళాఖాతంలో తుపాను ముప్పు

**కోస్తాంధ్రకు భారీ వర్ష సూచన**

**సోమవారం తుపానుగా మారే అవకాశం..**

**బుధవారం నాటికి కోస్తా తీరానికి చేరే ఛాన్స్**

**మంగళ, బుధవారాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు**

**అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరిక**




అమరావతి (ప్రశ్న న్యూస్) బంగాళాఖాతంలో అల్పపీడనం బలపడుతోంది. ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతానికి తుపాను ముప్పు పొంచి ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. తూర్పు మధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన సుస్పష్టమైన అల్పపీడనం శనివారం రాత్రిలోపు వాయుగుండంగా, ఆదివారం తీవ్ర వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని వెల్లడించింది. సోమవారం ఉదయానికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తుపానుగా మారే అవకాశముందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. బుధవారం ఉదయానికి కోస్తాంధ్ర తీరానికి చేరే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ వాతావరణ వ్యవస్థ ప్రభావంతో సోమవారం నుంచి రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా మంగళ, బుధవారాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తీర ప్రాంతాల్లో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉండటంతో మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లవద్దని స్పష్టం చేశారు.

### అల్పపీడనం నుంచి తుపానుగా..

తూర్పు మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం క్రమంగా బలపడే సూచనలు కనిపిస్తున్నాయి. ఇది వాయుగుండంగా, ఆపై తీవ్ర వాయుగుండంగా మారి సోమవారం నాటికి తుపానుగా బలపడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. అనంతరం బుధవారం ఉదయానికి కోస్తాంధ్ర తీరానికి చేరే అవకాశం ఉందని అంచనా వేసింది. ఈ నేపథ్యంలో వాతావరణ పరిస్థితులను అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. తుపాను దిశ, తీవ్రత, తీరం దాటే ప్రాంతం వంటి అంశాలపై తాజా సమాచారం ఆధారంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తుపాను కదలికల్లో మార్పులు సంభవించే అవకాశం ఉన్నందున అధికారిక హెచ్చరికలను ఎప్పటికప్పుడు గమనించాలని కోరారు.

### మంగళ, బుధవారాల్లో భారీ వర్షాలు!

తుపాను ప్రభావంతో సోమవారం నుంచి కోస్తాంధ్రలో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉంది. మంగళ, బుధవారాల్లో కొన్ని ప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. బలమైన ఈదురుగాలులు వీచే పరిస్థితులు ఉండటంతో తీర ప్రాంత ప్రజలు, రైతులు, మత్స్యకారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

భారీ వర్షాలు కురిసే ప్రాంతాల్లో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. నీరు నిలిచే ప్రాంతాలు, వాగులు, వంకలు, కాలువల సమీపంలో జాగ్రత్తలు పాటించాలి. వర్షాల సమయంలో అవసరం లేకుండా బయటకు వెళ్లకపోవడం మంచిది. విద్యుత్ స్తంభాలు, తెగిపడిన విద్యుత్ తీగలకు దూరంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

## తుఫాను గండం.. అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

**– అధికారులతో చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష**




అమరావతి (ప్రశ్న న్యూస్) బంగాళాఖాతంలో తుపాను ఏర్పడే అవకాశముందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించి, అధికార యంత్రాంగానికి కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) అధికారులతో ఆయన సమావేశమై పరిస్థితిని అంచనా వేశారు. తూర్పు మధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన అల్పపీడనం మరింత బలపడి వాయుగుండంగా మారింది. ఇది తుపానుగా మారే ప్రమాదం ఉందని అధికారులు సీఎంకు వివరించారు. దీని ప్రభావంతో రానున్న మంగళ, బుధవారాల్లో కోస్తాంధ్ర జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు పడొచ్చని అంచనా వేశారు. ఈ నేపథ్యంలో ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సర్వసన్నద్ధంగా ఉండాలని చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సీఎం అధికారులకు పలు సూచనలు చేశారు. "తుపాను ప్రభావంతో తీరప్రాంతాల్లో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. అందువల్ల మత్స్యకారులు వేటకు సముద్రంలోకి వెళ్లకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలి. ఇప్పటికే వెళ్లిన వారిని వెనక్కి రప్పించే ఏర్పాట్లు చేయాలి" అని ఆదేశించారు. తుపాను ప్రభావితమయ్యే జిల్లాల్లోని లోతట్టు ప్రాంతాల ప్రజలను ముందుగానే అప్రమత్తం చేసి, అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ప్రజలకు అత్యవసర సహాయం, సమాచారం అందించేందుకు వీలుగా ప్రతి జిల్లాలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని, టోల్ ఫ్రీ నంబర్లను అందుబాటులోకి తీసుకురావాలని చంద్రబాబు ఆదేశించారు. ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తూ వారిలో భయాందోళనలు తొలగించాలని, అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు.

## ఫ్రాన్స్ నిరసనల్లో దుకాణాల లూటీ

**– ఆన్‌లైన్ లో అమ్మకానికి దోపిడీ సొత్తు!**



పారిస్ (ప్రశ్న న్యూస్) ఫ్రాన్స్‌లో ఇటీవల చెలరేగిన అల్లర్ల నేపథ్యంలో చోటుచేసుకున్న దుకాణాల లూటీ వ్యవహారం కొత్త మలుపు తీసుకుంది. నిరసనకారులు, దుండగులు దోచుకున్న ఖరీదైన లగ్జరీ వస్తువులను ప్రముఖ ఆన్‌లైన్ మార్కెట్‌ప్లేస్‌లలో అమ్మకానికి పెట్టడం తీవ్ర కలకలం రేపుతోంది. దీంతో అప్రమత్తమైన ఫ్రాన్స్ ప్రభుత్వం, ఈ అక్రమ అమ్మకాలను అడ్డుకునేందుకు కఠిన చర్యలు చేపట్టింది. ఫ్రాన్స్ వాణిజ్య శాఖ మంత్రి సెర్జ్ పాపిన్ ప్రకారం, దేశవ్యాప్తంగా జరిగిన అల్లర్లలో సుమారు 3,000 రిటైల్ దుకాణాలు ధ్వంసం లేదా దోపిడీకి గురయ్యాయి. ముఖ్యంగా పారిస్‌లోని లెస్ హాల్స్ జిల్లాలో ఉన్న హెర్మేస్, లూయిస్ విట్టన్, ది నార్త్ ఫేస్ వంటి ప్రముఖ బ్రాండ్ల ఫ్లాగ్‌షిప్ స్టోర్లు తీవ్రంగా నష్టపోయాయి. దుకాణాల్లో దోపిడీ జరిగిన కొద్ది గంటల్లోనే, డిజైనర్ హ్యాండ్‌బ్యాగులు, ఖరీదైన సౌందర్య సాధనాలు, కాస్మెటిక్స్ వంటివి వింటెడ్, అమెజాన్, లెబాన్‌కాయిన్ వంటి ఆన్‌లైన్ సైట్లలో అమ్మకానికి ప్రత్యక్షమయ్యాయి. ఈ పరిణామంతో ఫ్రాన్స్ ప్రభుత్వం వెంటనే రంగంలోకి దిగింది. వాణిజ్య మంత్రి సెర్జ్ పాపిన్, డిజిటల్ వ్యవహారాల మంత్రి అన్నే లే హెనాఫ్.. వింటెడ్, అమెజాన్, ఈబే, మెటా, టిక్‌టాక్ వంటి సంస్థల ప్రతినిధులతో అత్యవసర వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఆయా ప్లాట్‌ఫామ్‌లపై ఉన్న దొంగసొత్తుకు సంబంధించిన లిస్టింగులను తక్షణమే తొలగించాలని ఆదేశించారు. దీనిపై స్పందించిన వింటెడ్, తమ ప్లాట్‌ఫామ్‌పై దొంగిలించిన వస్తువుల అమ్మకాల పట్ల "జీరో టాలరెన్స్" విధానాన్ని అనుసరిస్తామని తెలిపింది. తమ సైట్‌లో అసాధారణ రీతిలో లగ్జరీ వస్తువుల లిస్టింగులు పెరిగినట్లు గుర్తించామని, అధికారులతో కలిసి పనిచేస్తున్నామని పేర్కొంది. మరోవైపు, ఈబే కూడా తమ వద్ద దొంగసొత్తు అమ్మకాలను నిషేధించామని, అనుమానాస్పద ఖాతాలను గుర్తించేందుకు ప్రత్యేక అల్గారిథమ్‌లు, పరిశోధకుల బృందాలు ఉన్నాయని వెల్లడించింది. అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ మాట్లాడుతూ దోపిడీలకు పాల్పడిన వారిని గుర్తించి కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. ఫ్రెంచ్ చట్టాల ప్రకారం, దొంగసొత్తును కలిగి ఉండటం, అమ్మడం లేదా బదిలీ చేయడం వంటి నేరాలకు పాల్పడితే ఐదేళ్ల వరకు జైలు శిక్షతో పాటు 375,000 యూరోల వరకు జరిమానా విధించే అవకాశం ఉంది.

## అవినీతి అధికారులకు సెక్రటేరియట్‌లో లాబీయింగ్

**హైదరాబాద్ :** తెలంగాణలో అవినీతి నిరోధక శాఖ అధికారులు నెలకు సగటున 20 నుంచి 25 కేసుల వరకు నమోదు చేస్తూ లంచగొండి అధికారుల పాలిట సింహస్వప్నంగా మారుతున్నారు. లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడటం, అక్రమాస్తుల కేసుల్లో దాడులు జరగడం రోజువారీ వార్తల్లో చూస్తూనే ఉన్నాం. అయితే, అలా రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయిన అధికారులు ఆ తర్వాత ఏమవుతున్నారు? కోర్టుల్లో శిక్షలు పడుతున్నాయా అంటే.. సచివాలయంలోని కొన్ని విభాగాల మద్దతుతో, చట్టంలోని లొసుగులను ఆసరాగా చేసుకుని విచారణ నుంచి హాయిగా తప్పించుకుంటున్నారనే సంచలన నిజాలు బయటపడ్డాయి. హైదరాబాద్‌కు చెందిన ఫోరమ్ ఫర్ గుడ్ గవర్నెన్స్ సొసైటీ ప్రభుత్వానికి సమర్పించిన న నివేదిక ప్రకారం.. ఏసీబీ అధికారులు విచారణ పూర్తి చేసి సచివాలయానికి ప్రాసిక్యూషన్ అనుమతి కోసం పంపినప్పుడు తీవ్ర ఆలస్యం జరుగుతోంది. ప్రత్యక్షంగా లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన అధికారుల కేసులను కూడా ఏళ్ల తరబడి పెండింగ్‌లో పెడుతున్నారు. ఆ తర్వాత వాటిని కోర్టు విచారణ దాకా వెళ్లకుండా, నామమాత్రపు శాఖా పరమైన విచారణ లకు బదిలీ చేసి ఏసీబీ కేసులను ఉపసంహరించుకునేలా ఒత్తిడి తెస్తున్నారు. గడిచిన కొన్నేళ్లలో ఏసీబీ విచారణ అనుమతి కోరిన 22 కేసుల్లో ప్రభుత్వం అనుమతి నిరాకరించి, కేసులను ఉపసంహరించుకోవాలని ఆదేశించింది. అవినీతి నిరోధక చట్టం ప్రకారం ఉన్న సెక్షన్ 17ఎ నిబంధనను ప్రభుత్వ అధికారులు తమకు అనుకూలంగా వాడుకుంటున్నారు. అయితే దీనిపై అక్టోబర్ 16న స్పందించిన భారత అత్యున్నత న్యాయస్థానం చారిత్రాత్మక తీర్పు ఇచ్చింది. అధికారిక విధులు నిర్వహించడంలో తీసుకునే నిర్ణయాలకు మాత్రమే సెక్షన్ 17ఎ రక్షణ కల్పిస్తుంది. లంచం అడగడం లేదా తీసుకోవడం అనేది ఏ రకంగానూ అధికారిక విధి కిందకు రాదు. కాబట్టి రెడ్ హ్యాండెడ్‌గా లంచం తీసుకుంటూ పట్టుబడే అధికారులను విచారించడానికి ఎలాంటి ముందస్తు ప్రభుత్వ అనుమతి అవసరం లేదు అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. సచివాలయంలో అవినీతి అధికారులను కాపాడుతున్న బలమైన లాబీ కి చెక్ పెట్టాలని ఫోరమ్ ఫర్ గుడ్ గవర్నెన్స్ వ్యవస్థాపకులు ఎం. పద్మనాభరెడ్డి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాశారు. సుప్రీంకోర్టు ఆదేశాల మార్గదర్శకాల ప్రకారం, లంచం కేసుల్లో పట్టుబడిన అధికారులపై సెక్షన్ 17ఎ అనుమతి నెపంతో విచారణను నిలిపివేయకుండా ఏసీబీని నేరుగా ప్రాసిక్యూషన్‌కు అనుమతించేలా ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ సచివాలయమే అవినీతిపరులకు రక్షణ కవచంగా మారితే సమాజంలోకి తప్పుడు సంకేతాలు వెళ్తాయని పౌర సమాజం ఆందోళన వ్యక్తం చేస్తోంది.

## మహబూబాబాద్ జిల్లాలో విషాదం..

**– వ్యవసాయ బావిలో యువతి మృతదేహం**

**మహబూబాబాద్** గార్ల మండలం సీతంపేట గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మహేశ్వరి (21) వ్యవసాయ బావిలో మృతదేహమై కనిపించింది. నాలుగేళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన శేఖర్‌ను ప్రేమ వివాహం చేసుకున్న మహేశ్వరికి తొమ్మిది నెలల పాప శరణ్య, రెండేళ్ల కుమారుడు దేవాన్స్ ఉన్నారు. శుక్రవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన మహేశ్వరి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆమె కోసం వెతికారు. ఈ క్రమంలో వ్యవసాయ బావిలో ఆమె మృతదేహాన్ని గుర్తించారు. మహేశ్వరి మృతికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. ఆమె తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## హైదరాబాద్‌లో 'సైబర్ సిటీ ట్రెవిటా' ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ప్రారంభం.

**– 60 వేల చదరపు అడుగుల క్లబ్‌హౌస్,**

**– 35 ప్రపంచస్థాయి సదుపాయాలతో అల్ట్రా లగ్జరీ ప్రాజెక్ట్**

హైదరాబాద్ లో సైబర్ సిటీ బిల్డర్స్ అండ్ డెవలపర్స్ ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న అల్ట్రా లగ్జరీ రెసిడెన్షియల్ ప్రాజెక్ట్ 'సైబర్ సిటీ ట్రెవిటా' ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ప్రారంభించారు. ట్రూ లగ్జరీ థీమ్‌తో రూపొందించిన ఈ ప్రాజెక్ట్‌లో 35 ప్రపంచస్థాయి సదుపాయాలతో స్కైలైన్ డెక్, 60 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో క్లబ్‌హౌస్, టెర్రస్ పూల్‌తో పాటు 75 శాతం పచ్చని ప్రదేశాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.

అత్యాధునిక బయోమెట్రిక్ సెక్యూరిటీ వాల్ట్స్, రోబోటిక్ పార్శిల్ డెలివరీ వ్యవస్థ వంటి సాంకేతిక సదుపాయాలతో విలాసవంతమైన, సురక్షితమైన జీవనశైలిని అందించడమే లక్ష్యంగా ట్రెవిటాను రూపొందించినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు.

## ముదిరాజులను బీసీఏలో చేర్చడంపై బీసీ కులాల నిరసన

**రామాయంపేట** మెదక్ జిల్లారామాయంపేట మండల కేంద్రంలో శనివారం బీసీ ఐక్యకులాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ తల్లి విగ్రహం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు చాకలి మంగలి కులస్తులు ర్యాలీ చేపట్టారు.

అనంతరం మెదక్ రోడ్ లో ఉన్న అంబేద్కర్ చౌరస్తా వద్ద రాస్తారోకో నిర్వహించి తమ నిరసనను వ్యక్తం చేశారు. ముదిరాజ్ కులస్తులను బీసీఏలో చేర్చే నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వారు ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా అధ్యక్షులు సంగు స్వామి బీసీ కుల నాయకులు మామిడి సిద్ధరాములు మ్యాధరి భాను ఐక్యకులాల నాయకులు చాకలి మంగలి కులస్తులు తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరగాళ్ల మ్యూల్ ఖాతాలపై పోలీసుల కొరడా

**– కమిషనరేట్ వ్యాప్తంగా 29 కేసులు నమోదు, 88 మందిపై చర్యలు**

**కరీంనగర్** సైబర్ మోసాలకు వినియోగించే మ్యూల్ బ్యాంక్ ఖాతాలపై పోలీసులు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక నిఘా ఉంచి కఠిన చర్యలు చేపట్టారు. వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో దర్యాప్తులో ఉన్న సైబర్ క్రైమ్ కేసులకు సంబంధించి నమోదైన వివరాలను సీపీ గౌష్ ఆలం వెల్లడించారు. జిల్లాలోని మొత్తం 16 పోలీస్ స్టేషన్ల పరిధిలో ఇప్పటివరకు 29 ఎఫ్ఐఆర్‌లు నమోదు కాగా, వీటిలో మొత్తం 122 మందిని నిందితులుగా గుర్తించారు. వీరిలో 89 మందికి సంబంధించి అరెస్ట్‌లు లేదా చట్టపరమైన నోటీసులు జారీ చేయడం పూర్తి కాగా, మిగిలిన 33 మంది నిందితుల అరెస్ట్ ప్రక్రియ పెండింగ్‌లో ఉందని సీపీ తెలిపారు. పోలీస్ స్టేషన్ల వారీగా వివరాలు: కరీంనగర్ 1 టౌన్: 6 కేసులు, 20 మంది నిందితులు 13 మందిపై చర్యలు, 7 పెండింగ్, కరీంనగర్ 2 టౌన్: 5 కేసులు, 26 మంది నిందితులు 16 మందిపై చర్యలు,10 పెండింగ్, కరీంనగర్ 3 టౌన్: 2 కేసులు, 12 మంది నిందితులు 10 మందిపై చర్యలు, 2 పెండింగ్, కరీంనగర్ రూరల్: 1 కేసు, 6 నిందితులు, 1 పై చర్యలు, 5నిందితులు అరెస్ట్ పెండింగ్ జమ్మికుంట టౌన్: 3 కేసులు, 15 మంది నిందితులు 11 మందిపై చర్యలు, 4 పెండింగ్, హుజూరాబాద్ టౌన్: 2 కేసులు, 10 మంది నిందితులు 9 మందిపై చర్యలు, 1 పెండింగ్, కొత్తపల్లి: 2 కేసులు, 5 గురు నిందితులు అందరిపై చర్యలు పూర్తి. మానకొండూరు: 2 కేసులు,3 నిందితులు 1 చర్యలు పూర్తి, 2 పెండింగ్, చొప్పదండి: 1 కేసు,5 నిందితులు అందరిపై చర్యలు పూర్తి. ఇల్లందకుంట: 1 కేసు, 5 నిందితులు అందరిపై చర్యలు పూర్తి)శ్రీ, గంగాధర: 1 కేసు,6 నిందితులు అందరిపై చర్యలు పూర్తి, ఎల్.ఎం.డి. కాలనీ: 1 కేసు, 7 గురు నిందితులు 6 గురు పై చర్యలు, 1 పెండింగ్, సైదాపూర్: 1 కేసు,1 నిందితుడు చర్యలు పూర్తి. వీణవంక: 1 కేసు,1 నిందితుడు అరెస్ట్ పెండింగ్, కేశవపట్నం–రామడుగు: ఎటువంటి కేసులు నమోదు కాలేదు. పోలీసుల హెచ్చరిక:తమ బ్యాంక్ ఖాతాలను, ఏటీఎం కార్డులను, లేదా ఓటీపీలను ఇతరులకు అద్దెకు ఇవ్వడం గానీ, కమిషన్ల ఆశ చూపి చేసే లావాదేవీలకు వినియోగించడానికి ఇవ్వడం గానీ నేరమని పోలీసులు స్పష్టం చేశారు. సైబర్ నేరగాళ్లకు సహకరించే ఖాతాదారులను కూడా చట్టపరంగా నేరంలో భాగస్వాములుగానే పరిగణించి కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు. అపరిచిత వ్యక్తులకు బ్యాంక్ ఖాతా వివరాలు ఇవ్వవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## నిదానంగా ఎమ్మెల్సీ ఎన్నికలకోసం ఓటర్ల నమోదు

**హైదరాబాద్ :** తెలంగాణలో త్వరలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకోసం ఓటర్ల నమోదు ప్రక్రియ జరుగుతోంది. చదువుకున్న నిరుద్యోగులు, ప్రైవేట్ ఉద్యోగులు, ఐటీ నిపుణులు అధికంగా ఉండే రాజధాని హైదరాబాద్‌లో ఓటర్ల నమోదు ప్రక్రియ ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదు. దీనికి విరుద్ధంగా, నల్గొండ– ఖమ్మం– వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గంలో మాత్రం ఓటర్ల నమోదు ఉత్సాహంగా సాగుతోంది. నవంబర్ 6 నాటికి ఓటర్ల నమోదుకు తుది గడువు ముగియనుంది. ఈ నేపథ్యంలో పట్టణ ప్రాంతాల్లో ప్రధాన రాజకీయ పార్టీలు ఓటర్ల నమోదులో విఫలమవుతుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. హైదరాబాద్– రంగారెడ్డి– మహబూబ్ నగర్ నియోజకవర్గంలో కేవలం 1,91,360 దరఖాస్తులు మాత్రమే అందగా, నల్గొండ– ఖమ్మం– వరంగల్ నియోజకవర్గంలో ఏకంగా 2,44,349 దరఖాస్తులు వచ్చాయి. హైదరాబాద్ పరిధిలోని రంగారెడ్డి జిల్లాలో 53,491 దరఖాస్తులు, మేడ్చల్ లో 37,364, హైదరాబాద్ జిల్లాలో 22,535, వికారాబాద్ లో 15,020 చొప్పున నమోదయ్యాయి. ఇక రెండో నియోజకవర్గానికి వస్తే? నల్గొండలో 46,038, సూర్యాపేటలో 31,512, ఖమ్మంలో 37,848 దరఖాస్తులతో గ్రామీణ–అర్బన్ మిశ్రమ ప్రాంతాలు అగ్రస్థానంలో నిలిచాయి. 2021 ఓటర్ల జాబితాతో పోలిస్తే అప్పట్లో హైదరాబాద్ నియోజకవర్గంలో 5.31 లక్షలు, నల్గొండ నియోజకవర్గంలో 5.05 లక్షల మంది ఓటర్లు ఉండేవారు. అయితే, ప్రస్తుత గణాంకాలు కేవలం అందిన దరఖాస్తులను మాత్రమే సూచిస్తున్నాయని, ఇవి తుది ఓటర్ల జాబితా వచ్చేసరికి మారే అవకాశం ఉందని అధికారులు స్పష్టం చేస్తున్నారుఓటర్ల నమోదు ప్రక్రియ మందకొడిగా సాగడానికి ప్రధాన కారణం రాజకీయ పార్టీల వైఫల్యమేనని విశ్లేషకులు భావిస్తున్నారు. పండుగ వాతావరణం, ఇతర రాజకీయ కార్యక్రమాలతో బిజీగా ఉన్న పార్టీలు పట్టభద్రుల నమోదుపై దృష్టి పెట్టడంలో విఫలమయ్యాయి. ముఖ్యంగా అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు కేవలం సాధారణ ఎన్నికలు, స్థానిక సంస్థల పైనే దృష్టి సారిస్తుండటంతో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రాముఖ్యతను క్రింది స్థాయి క్యాడర్‌కు చేరవేయడంలో చొరవ చూపడం లేదు. హైదరాబాద్‌లో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి స్థిరపడిన నిపుణులు, ఐటీ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో ఉన్నప్పటికీ, నివాస ధృవీకరణ పత్రాలు సమర్పించడంలో ఉండే నిబంధనలు, అవగాహన లోపం ఓటర్ల నమోదును దెబ్బతీస్తున్నాయి. పార్టీల యంత్రాంగం బూత్ స్థాయి నుంచి పట్టభద్రులను మోబిలైజ్ చేయడంలో విఫలమవడం వల్లనే అర్హులైన లక్షలాది మంది ఓటు హక్కుకు దూరమయ్యే ప్రమాదం ఏర్పడింది. ఎమ్మెల్సీ ఎన్నికలు కేవలం చట్టసభల ప్రాతినిధ్యం మాత్రమే కాదు, రాబోయే రాజకీయ పరిణామాలకు ఒక రిఫరెండమ్‌గా భావిస్తారు. పట్టభద్రుల నియోజకవర్గాల్లో విజయం సాధించడం ద్వారా మేధావి వర్గం తమవెంట ఉందనే సంకేతాలను రాజకీయ పార్టీలు పంపాలనుకుంటాయి. అయితే, హైదరాబాద్ వంటి ప్రతిష్ఠాత్మక నియోజకవర్గంలో ఓటర్ల నమోదు పట్ల చూపుతున్న నిర్లక్ష్యం ఆయా పార్టీల బలాన్ని బలహీనపరిచే అవకాశం ఉంది. రానున్న కొద్ది రోజుల్లో పార్టీలు తమ వ్యూహాలను మార్చుకుని, అర్హులైన పట్టభద్రులతో దరఖాస్తులు పూర్తి చేయించడంలో ఎంతవరకు సఫలమవుతాయనే అంశంపైనే ఎన్నికల ఫలితాలు ఆధారపడి ఉంటాయి. గడువు సమీపిస్తున్న తరుణంలో రాజకీయ పార్టీలు మేలుకుని క్రియాశీలక పాత్ర పోషిస్తాయా లేదా అనేది వేచి చూడాలి.

# విజయవాడ తూర్పులో కూటమి జోరు

**29 డివిజన్లలోనూ గెలుపు మాదే**

**మేయర్ అభ్యర్థి వంగవీటి రాధాకు భారీ మెజారిటీ ఖాయం**

**: ఎంపీ కేశినేని చిన్ని ధీమా**

**డ్రైనేజీ సమస్యకు పరిష్కారం..**

**నగర సమగ్ర అభివృద్ధికి ప్రాధాన్యం**



విజయవాడ (ప్రశ్న న్యూస్) విజయవాడ నగర పాలక సంస్థ ఎన్నికల ప్రచారంలో కూటమి అభ్యర్థుల తరఫున ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) దూకుడు పెంచారు. విజయవాడ తూర్పు నియోజకవర్గంలోని 11, 12, 17వ డివిజన్లలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌తో కలిసి ప్రచారం నిర్వహించారు. కూటమి బలపరిచిన మేయర్ అభ్యర్థి వంగవీటి రాధాతోపాటు ఆయా డివిజన్లలో పోటీ చేస్తున్న కార్పొరేటర్ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. తూర్పు నియోజకవర్గ పరిధిలోని మొత్తం 29 డివిజన్లలోనూ కూటమి అభ్యర్థులు విజయం సాధిస్తారని, మేయర్ అభ్యర్థి వంగవీటి రాధా భారీ మెజారిటీతో గెలుపొందడం ఖాయమని కేశినేని చిన్ని ధీమా వ్యక్తం చేశారు.

## 29 డివిజన్లలోనూ విజయమే లక్ష్యం..

విజయవాడ తూర్పు నియోజకవర్గంలో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ఎంపీ కేశినేని చిన్ని ఎన్నికల ప్రచారాన్ని కొనసాగించారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌తో కలిసి వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తూ ప్రజలను కలుసుకున్నారు. కూటమి అభ్యర్థులకు మద్దతు తెలిపి, భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా 11వ డివిజన్‌లో జనసేన, బీజేపీ బలపరిచిన కార్పొరేటర్ అభ్యర్థి భాగం సాయి ప్రసాద్, 12వ డివిజన్‌లో చెన్నుపాటి క్రాంతి శ్రీ, 17వ డివిజన్‌లో కోనేరు రాజేష్‌లకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి ఓటర్లను కలుసుకుంటూ కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేశారు. తూర్పు నియోజకవర్గంలోని 29 డివిజన్లలోనూ కూటమి అభ్యర్థుల గెలుపు ఖాయమని కేశినేని చిన్ని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రజలు కూటమి పాలన పట్ల సంతృప్తితో ఉన్నారని, అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యమిస్తున్న అభ్యర్థులకు మద్దతు తెలపడానికి సిద్ధంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు.

## వంగవీటి రాధాకు భారీ మెజారిటీ వస్తుంది

కూటమి తరఫున మేయర్ అభ్యర్థిగా బరిలో ఉన్న వంగవీటి రాధా భారీ మెజారిటీతో విజయం సాధిస్తారని ఎంపీ కేశినేని చిన్ని ఆశాభావం వ్యక్తం చేశారు. విజయవాడ నగర అభివృద్ధికి కూటమి అభ్యర్థులు కట్టుబడి ఉన్నారని తెలిపారు. ప్రజల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి ప్రాధాన్యం ఇచ్చే నాయకత్వానికి ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు. కూటమి అభ్యర్థులను గెలిపిస్తే విజయవాడ నగర రూపురేఖలను మార్చేలా అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. నగరంలో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంతోపాటు ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు చెన్నుపాటి గాంధీ, ఐలా ప్రతినిధులు, నాయకులు చిలకలపూడి లక్ష్మీ నరసింహ, కడియాల దుర్గాభవాని, మోటపర్తి వరలక్ష్మి, సుధీర్‌తోపాటు ఆయా డివిజన్లకు చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చదువుకు అడ్డుకట్ట వద్దు.. మైనారిటీ బాలికలకు విద్యా బాట

**బుచ్చిరెడ్డిపాలెంలో రూ.95 లక్షలతో ఉర్దూ పాఠశాల అభివృద్ధి**

**రూ.75 లక్షలతో ఆధునిక హైస్కూల్,**

**ఇప్పటికే రూ.20 లక్షలతో స్థలం కొనుగోలు**

**ఉర్దూ కళాశాల ఏర్పాటుకూ హామీ, ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ప్రకటన**



బుచ్చిరెడ్డిపాళెం (ప్రశ్న న్యూస్) ఎనిమిదో తరగతితోనే బాలికల చదువుకు స్వస్తి పలకాల్సిన పరిస్థితికి చరమగీతం పాడాలి.. ఆర్థిక ఇబ్బందులు, విద్యాసదుపాయాల కొరతతో మైనారిటీ విద్యార్థినుల భవిష్యత్తు ఆగిపోకూడదు! ఈ లక్ష్యంతో బుచ్చిరెడ్డిపాళెంలో ఉర్దూ విద్యాభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడతామని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ప్రకటించారు. వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా రూ.75 లక్షలతో ఆధునిక సౌకర్యాలతో ఉన్నత పాఠశాలను అభివృద్ధి చేస్తామని, ఇప్పటికే రూ.20 లక్షలతో స్థలం కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. అంతేకాకుండా ఉర్దూ కళాశాల ఏర్పాటుకు కూడా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## మైనారిటీ విద్యకు పెద్దపీట..

బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాలిటీ పరిధిలోని 12, 13వ వార్డుల్లో శనివారం నిర్వహించిన 'చెప్పాం.. చేస్తున్నాం' ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ఈ వివరాలు వెల్లడించారు. కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రజలను కలుసుకుని ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. మైనారిటీ కుటుంబాల్లోని బాలికలు ఎనిమిదో తరగతి తర్వాత చదువును కొనసాగించలేకపోతున్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పాఠశాల అభివృద్ధికి ముందుకొచ్చినట్లు తెలిపారు. విద్య ద్వారానే కుటుంబాల ఆర్థిక, సామాజిక స్థితిగతుల్లో మార్పు సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

## పాఠశాలకు రూ.75 లక్షలు.. స్థలం కోసం రూ.20 లక్షలు

వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా రూ.75 లక్షలతో ఆధునిక సౌకర్యాలతో ఉన్నత పాఠశాలను అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే వెల్లడించారు. ఇందుకోసం ఇప్పటికే రూ.20 లక్షలతో స్థలం కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఈ రెండు మొత్తాలు కలిపి రూ.95 లక్షలు కావడంతో, పాఠశాల అభివృద్ధి ప్రణాళిక మైనారిటీ విద్యార్థులకు ప్రాధాన్యం ఇచ్చే ప్రయత్నంగా నిలుస్తోంది. పాఠశాల అభివృద్ధి పూర్తయితే బాలికలకు మెరుగైన విద్యావకాశాలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. అయితే, నిర్మాణ పనులు, సౌకర్యాల కల్పన, తరగతుల నిర్వహణ వంటి తదుపరి చర్యలు ప్రణాళికను ఆచరణలోకి తీసుకురావడంలో కీలకం కానున్నాయి.

# ఇంద్రకీలాద్రిపై సెక్యూరిటీ పెత్తనం

# భక్తులపై దురుసు.. విధుల్లో నిర్లక్ష్యం

**దుర్గమ్మ దర్శనానికి వస్తే అవమానాలా.?**

**భద్రత కల్పించాల్సిన సిబ్బందే**

**ఇబ్బందులకు కారణమవుతున్నారా.?**

**డ్యూటీలో సెల్‌ఫోన్లతో కాలక్షేపం,**

**లిఫ్టుల వద్ద పట్టని రద్దీ, వృద్ధులు,**

**దివ్యాంగుల అవస్థలు**

**దళారుల సేవలో తరిస్తున్నారనే**

**ఆరోపణలు, సిబ్బంది తీరుపై ఆలయ**

**అధికారులు విచారణ జరిపేనా.?**

విజయవాడ(ప్రశ్న న్యూస్) అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు భరోసా కల్పించాల్సిన సెక్యూరిటీ సిబ్బంది.. వారిపట్ల దురుసుగా ప్రవర్తిస్తే ఎలా? రద్దీని నియంత్రించాల్సిన వారే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే పరిస్థితి ఏమిటి? విధి నిర్వహణ సమయంలో అప్రమత్తంగా ఉండాల్సిన సిబ్బంది సెల్‌ఫోన్లలో వీడియోలు, రీల్స్ చూస్తూ కాలక్షేపం చేస్తున్నారనే ఆరోపణలు వస్తే బాధ్యత ఎవరిది.? విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొందరు సెక్యూరిటీ సిబ్బంది వ్యవహారశైలిపై భక్తుల నుంచి వస్తున్న ఫిర్యాదులు ఇలాంటి ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. దుర్గమ్మ దర్శనం కోసం భక్తులు కొండపైకి వస్తుంటే.. వారికి సౌకర్యాలు కల్పించాల్సిన సిబ్బంది ప్రవర్తన కారణంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణలపై ఆలయ అధికారులు సమగ్రంగా పరిశీలించి వాస్తవాలను వెల్లడించాల్సిన అవసరం ఉంది.

## భక్తులపై అధికారం.. విధులపై నిర్లక్ష్యమా.?

ఇంద్రకీలాద్రిపై నిత్యం భక్తుల రాకపోకలు కొనసాగుతుంటాయి. సాధారణ రోజులతో పోలిస్తే పర్వదినాలు, శుక్రవారాలు, ఆదివారాలు, సెలవుల సమయంలో రద్దీ పెరిగే అవకాశం ఉంటుంది. ఇలాంటి సందర్భాల్లో సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తంగా ఉండటం అత్యంత ముఖ్యం. క్యూలైన్లను క్రమబద్ధీకరించడం, భక్తులకు మార్గనిర్దేశం చేయడం, తోపులాట జరగకుండా చూడటం, వృద్ధులు, దివ్యాంగులకు సహకరించడం వారి విధుల్లో కీలకమైనవి. అయితే, కొందరు సిబ్బంది భక్తులతో మర్యాదగా వ్యవహరించడం లేదని, చిన్నచిన్న విషయాలకే దురుసుగా సమాధానాలు చెబుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి. దర్శన మార్గం ఎక్కడుందని అడిగినా, లిఫ్టుల గురించి సమాచారం కోరినా సహనంతో వివరించాల్సిన బాధ్యత సిబ్బందిదే. భక్తులు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పడం విధి నిర్వహణలో భాగమనే విషయాన్ని మరిచిపోతే ఎలా.? సెక్యూరిటీ అంటే అధికారం చెలాయించడం కాదు.. భద్రత కల్పించడం. యూనిఫాం ధరించినంత మాత్రాన భక్తుల పట్ల అమర్యాదగా ప్రవర్తించే హక్కు ఎవరికీ ఉండదు. విధుల్లో క్రమశిక్షణ ఎంత ముఖ్యమో, మాటతీరులో మర్యాద కూడా అంతే ముఖ్యం. ఈ విషయంపై ఆలయ ఉన్నతాధికారులు సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాల్సిన అవసరం ఉంది.

## డ్యూటీలో సెల్‌ఫోన్లతో కాలక్షేపమా.?

విధి నిర్వహణలో ఉన్న సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలి. ముఖ్యంగా భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ప్రతి కదలికను గమనిస్తూ, అవసరమైనప్పుడు తక్షణమే స్పందించాలి. అలాంటి సమయంలో కొందరు సెక్యూరిటీ సిబ్బంది సెల్‌ఫోన్లలో రీల్స్, వీడియోలు చూస్తూ కాలక్షేపం చేస్తున్నారనే ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయి. విధి సమయంలో వ్యక్తిగత ఫోన్ వినియోగంపై ఆలయ యంత్రాంగం ఎలాంటి నిబంధనలు అమలు చేస్తోంది? సిబ్బంది తమకు కేటాయించిన ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉన్నారో లేదో పరిశీలించే వ్యవస్థ ఉందా? విధుల్లో నిర్లక్ష్యం చేసినట్లు తేలితే ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు? అనే ప్రశ్నలకు సమాధానాలు అవసరం. సెల్‌ఫోన్ వినియోగం కారణంగా భక్తుల రద్దీని గమనించకపోవడం, అత్యవసర పరిస్థితుల్లో స్పందన ఆలస్యం కావడం వంటి పరిణామాలకు అవకాశం ఉంటుంది. అయితే, ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రతి సిబ్బంది విషయంలోనూ వాస్తవాలను ఆధారాలతో నిర్ధారించాలి. అందుబాటులో ఉన్న సీసీటీవీ దృశ్యాలు, విధుల రికార్డులు, ప్రత్యక్ష సాక్షుల వివరాలను పరిశీలించి చర్యలు తీసుకోవాలి.

## లిఫ్టుల వద్ద వృద్ధుల అవస్థలు.. పట్టించుకునేదెవరు.?

ఇంద్రకీలాద్రిపైకి వచ్చే భక్తుల్లో వృద్ధులు, దివ్యాంగులు, అనారోగ్యంతో బాధపడేవారు, ఎక్కువ దూరం నడవలేని వారు ఉంటారు. వీరికి లిఫ్టులు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి.



అయితే, లిఫ్టుల వద్ద రద్దీ పెరిగినప్పుడు భక్తులను క్రమబద్ధీకరించడం, క్యూలైన్లను నియంత్రించడం, అవసరమైన వారికి ప్రాధాన్య సహాయం అందించడం అత్యవసరం. లిఫ్టుల వద్ద విధులు నిర్వహించాల్సిన సిబ్బంది అప్రమత్తంగా లేకపోతే ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉంది. రద్దీ సమయంలో తోపులాట జరిగితే వృద్ధులు, దివ్యాంగులు మరింత అవస్థలు పడాల్సి వస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో సిబ్బంది ఎక్కడ ఉన్నారు.? వారికి కేటాయించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తున్నారా.? అన్నది పరిశీలించాల్సిన అంశం. వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేక సౌకర్యాలు ఏర్పాటు చేయడం మాత్రమే సరిపోదు. వాటిని సద్వినియోగం చేసుకునేలా సహాయక సిబ్బంది అందుబాటులో ఉండాలి. రద్దీని అంచనా వేసి అదనపు సిబ్బందిని నియమించాలి. లిఫ్టుల సామర్థ్యానికి మించి భక్తులను అనుమతించకుండా చూడాలి. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలి. దుర్గమ్మ దర్శనం కోసం వచ్చిన వృద్ధ భక్తుడు సహాయం కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఎందుకు రావాలి.? దివ్యాంగుడికి సౌకర్యం కల్పించాల్సిన చోటే ఇబ్బందులు ఎదురైతే ప్రత్యేక ఏర్పాట్ల వల్ల ప్రయోజనం ఏమిటి.?

# ఇంద్రకీలాద్రిపై సేవా వైభవం

- అమ్మవారి బ్రహ్మోత్సవాల విజయానికి సమష్టి కృషి - పోలీసులకు, ఆలయ సిబ్బందికి భక్తుల కృతజ్ఞతలు
- భద్రత నుంచి దర్శనం వరకు సమర్థ నిర్వహణ.. - క్యూలైన్లలో సౌకర్యాలు, అన్నప్రసాదంతో భక్తసేవ
- ఈవో మొదలుకొని క్షేత్రస్థాయి సిబ్బంది వరకు అంకితభావం.. స్వచ్ఛంద సంస్థల సేవలకు అభినందనలు



విజయవాడ(ప్రశ్న న్యూస్) కొండపై ఆధ్యాత్మిక వైభవం.. అమ్మవారి సన్నిధిలో భక్తజన సందోహం.. విధి నిర్వహణలో పోలీసుల అప్రమత్తత.. భక్తసేవలో ఆలయ ఉద్యోగుల అంకితభావం.. సహాయ కార్యక్రమాల్లో స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం! ఇవన్నీ కలిసివచ్చి విజయవాడ ఇంద్రకీలాద్రిపై శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి దసరా శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాల నిర్వహణలో కీలకపాత్ర పోషించాయి. ఉత్సవాలకు భారీగా తరలివచ్చిన భక్తులకు దర్శన సౌకర్యాలు కల్పించడంతోపాటు భద్రత, క్యూలైన్ల నిర్వహణ, తాగునీరు, ప్రసాదాల పంపిణీ, అన్నప్రసాద సేవలు వంటి అంశాల్లో వివిధ విభాగాలు సమన్వయంతో పనిచేయడం పట్ల భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేసిన ఆలయ ఈవో, పోలీసు అధికారులు, పోలీసు సిబ్బంది, దేవస్థానం ఉద్యోగులు, అమ్మవారి సేవా విభాగం, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు భక్తులు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతున్నారు.

## అమ్మవారి సేవలో సమష్టి కృషి, విజయవంతమైన ఉత్సవాలు..

ఇంద్రకీలాద్రిపై దసరా నవరాత్రి ఉత్సవాలు అంటేనే లక్షలాది మంది భక్తుల విశ్వాసానికి ప్రతీక. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు తరలివస్తారు. రద్దీ పెరిగే కొద్దీ దర్శన ఏర్పాట్లు, భద్రత, రవాణా, క్యూలైన్ల నియంత్రణ, పారిశుద్ధ్యం వంటి అంశాలపై యంత్రాంగం మరింత అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ఆలయ పరిపాలనా విభాగం, పోలీసు శాఖ, భద్రతా సిబ్బంది, వివిధ ప్రభుత్వ శాఖలు, సేవా బృందాలు పరస్పర సమన్వయంతో పనిచేయడం ఎంతో ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రతి విభాగం తనకు అప్పగించిన బాధ్యతను నిర్వర్తిస్తూ భక్తులకు ఇబ్బందులు తగ్గించేలా కృషి చేయడం ఉత్సవాల నిర్వహణలో ముఖ్యమైన అంశంగా నిలిచింది. అమ్మవారి దర్శనం కోసం వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించడం ఒక బాధ్యత అయితే, రద్దీని క్రమబద్ధీకరిస్తూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా చూడటం మరో కీలక బాధ్యత. ఈ రెండు అంశాల మధ్య సమతుల్యత పాటించేందుకు కృషి చేసిన సిబ్బందిని భక్తులు అభినందిస్తున్నారు.

## భద్రతకు పెద్దపీట.. పోలీసుల సేవలకు ప్రశంసలు

భారీ ఆధ్యాత్మిక ఉత్సవాల్లో పోలీసు శాఖ పాత్ర అత్యంత కీలకం. భక్తుల రాకపోకలను క్రమబద్ధీకరించడం, రద్దీని



నియంత్రించడం, క్యూలైన్ల వద్ద అప్రమత్తంగా ఉండటం, అత్యవసర పరిస్థితుల్లో తక్షణ చర్యలు తీసుకోవడం వంటి బాధ్యతలను పోలీసులు నిర్వర్తించాల్సి ఉంటుంది.

ఇంద్రకీలాద్రి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా భద్రతా ఏర్పాట్లలో నిమగ్నమైన పోలీసు అధికారులు, సిబ్బంది కృషిని భక్తులు ప్రత్యేకంగా గుర్తిస్తున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా విధులు నిర్వహించడం, క్షేత్రస్థాయిలో పరిస్థితులను పర్యవేక్షించడం, దర్శనానికి వచ్చే వారికి అవసరమైన మార్గదర్శకత్వం అందించడం వంటి అంశాల్లో పోలీసుల సేవలు కీలకంగా నిలిచాయని పలువురు భక్తులు పేర్కొంటున్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన ప్రతి భక్తుడూ క్షేమంగా వెళ్లాలన్న లక్ష్యంతో విధులు నిర్వహించిన పోలీసు సిబ్బందికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నారు. పండుగ వేళ కుటుంబాలతో గడపాల్సిన సమయాన్ని సైతం విధులకు కేటాయిస్తూ భక్తుల భద్రతకు ప్రాధాన్యమిచ్చిన సిబ్బంది సేవలను అభినందిస్తున్నారు.

## ఆలయ ఈవోకు అభినందనలు.. ఉద్యోగుల అంకితభావానికి గుర్తింపు

ఒక భారీ ఉత్సవం విజయవంతం కావాలంటే ముందస్తు ప్రణాళిక, బాధ్యతల కేటాయింపు, నిరంతర పర్యవేక్షణ, విభాగాల మధ్య సమన్వయం అవసరం. ఈ విషయంలో దేవస్థానం పరిపాలనా యంత్రాంగం పాత్ర ఎంతో ముఖ్యమైనది. దర్శన ఏర్పాట్ల నుంచి ప్రసాదాల పంపిణీ వరకు, అన్నప్రసాద కేంద్రాల నిర్వహణ నుంచి భక్తులకు అవసరమైన సౌకర్యాల కల్పన వరకు అనేక పనులను సమన్వయం చేయాల్సి ఉంటుంది. ఈ బాధ్యతలను నిర్వహించడంలో ఆలయ ఈవోతోపాటు వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు, క్షేత్రస్థాయి సిబ్బంది కృషి అభినందనీయమని భక్తులు పేర్కొంటున్నారు. విధుల నిర్వహణలో ఎదురయ్యే ఒత్తిడిని అధిగమిస్తూ, భక్తులకు సాధ్యమైనంత మెరుగైన సేవలు అందించేందుకు సిబ్బంది కృషి చేయడం ఉత్సవాల నిర్వహణలో కీలకమైంది. తెరపై కనిపించే వైభవం



వెనుక తెరవెనుక పనిచేసే అనేకమంది ఉద్యోగుల శ్రమ ఉంటుందని భక్తులు గుర్తుచేస్తున్నారు. అమ్మవారి సేవలో భాగంగా తమ బాధ్యతలను అంకితభావంతో నిర్వర్తించిన ప్రతి ఉద్యోగికీ అభినందనలు తెలియజేస్తూ, దేవస్థానం యంత్రాంగానికి



కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

## క్యూలైన్లలో సౌకర్యాలు.. భక్తసేవే పరమావధి

నవరాత్రి ఉత్సవాల సమయంలో భక్తులు గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉండాల్సిన పరిస్థితులు ఏర్పడవచ్చు. అటువంటి సమయంలో తాగునీరు, పాలు వంటి సౌకర్యాలు అందుబాటులో ఉండటం భక్తులకు ఎంతో ఉపశమనాన్ని కలిగిస్తుంది. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు, దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ఈ సౌకర్యాలు మరింత ఉపయోగకరంగా ఉంటాయి. భక్తుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని క్యూలైన్ల నిర్వహణ, తాగునీటి సరఫరా, ప్రసాదాల పంపిణీ వంటి అంశాలపై శ్రద్ధ చూపడం మంచి నిర్వహణకు నిదర్శనం. ఈ సేవల్లో పాల్గొన్న ఆలయ ఉద్యోగులు, అమ్మవారి సేవా విభాగం సభ్యులు, ఇతర సహాయక బృందాలకు భక్తులు ధన్యవాదాలు తెలుపుతున్నారు. దర్శనం కోసం వచ్చిన భక్తులకు కేవలం అమ్మవారి దర్శనమే కాకుండా, వేచి ఉన్న సమయంలోనూ అవసరమైన సౌకర్యాలు అందించాలన్న ఆలోచనతో పనిచేయడం అభినందనీయమని పేర్కొంటున్నారు. భక్తుల పట్ల సేవాభావంతో వ్యవహరించే ప్రతి సిబ్బంది కృషి ఆలయంపై భక్తులకు మరింత విశ్వాసాన్ని కలిగిస్తుందని అంటున్నారు.



# సరైన అవకాశం కోసం ఎదురుచూడొద్దు

## - నటి తమన్నా

సరైన అవకాశం కోసం ఎదురుచూడటం అనేది అతిపెద్ద అబద్ధమని ప్రముఖ నటి తమన్నా అన్నారు. విజయం సాధించాలంటే వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ముందుకు సాగాలే కానీ... పరిపూర్ణమైన అవకాశం వస్తుందని ఎదురుచూస్తూ కూర్చోకూడదని ఆమె స్పష్టం చేశారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తన కెరీర్ ప్రయాణం గురించి తమన్నా ఆసక్తికర విషయాలు పంచుకున్నారు.తాను ఇండస్ట్రీలోకి అడుగుపెట్టినప్పుడు గొప్ప నటిని కానీ, అద్భుతమైన డ్యాన్సర్‌ను కానీ కాదని తమన్నా గుర్తుచేసుకున్నారు. పరిశ్రమలోకి వచ్చాక అనుభవం ద్వారానే ప్రతి విషయాన్ని నేర్చుకున్నానని తెలిపారు. ఏదైనా కొత్త విషయం నేర్చుకోవడానికి, దాన్ని ఆచరణలో పెట్టడమే ఉత్తమ మార్గమని ఆమె అభిప్రాయపడ్డారు.జీవితంలో మనం చేసే ప్రతి పని ఏదో ఒక కొత్త విషయాన్ని నేర్పుతుందని, అది మన కెరీర్‌ను తదుపరి స్థాయికి తీసుకెళ్లడంలో సహాయపడుతుందని వివరించారు. ఖాళీగా కూర్చొని మంచి అవకాశం కోసం ఎదురుచూసే బదులు, దొరికిన అవకాశాలను ఉపయోగించుకోవాలని, అదే నిజమైన విజయ రహస్యమని తమన్నా పేర్కొన్నారు. ప్రస్తుతం తమన్నా సినిమాలు, ఓటీటీ వెబ్ సిరీస్‌లతో కెరీర్‌లో చురుగ్గా కొనసాగుతున్నారు.

# ఎయిర్‌పోర్ట్‌లో చుట్టుముట్టి తాకారు

## నటి అనుపమ పరమేశ్వరన్ ఆవేదన



ప్రముఖ నటి అనుపమ పరమేశ్వరన్ తనకు ఎయిర్‌పోర్ట్‌లో ఎదురైన ఓ చేదు అనుభవాన్ని తాజాగా ఓ పాడ్‌కాస్ట్‌లో పంచుకున్నారు. కొందరు వ్యక్తులు తనను చుట్టుముట్టి, అనుమతి లేకుండా ఫొటోలు తీయడమే కాకుండా అసభ్యంగా తాకారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన తనను మానసికంగా ఎంతో ఇబ్బంది పెట్టిందని తెలిపారు.వివరాల్లోకి వెళ్తే, ఇటీవల ఓ ఎయిర్‌పోర్ట్‌లో లగేజీ కోసం ఒంటరిగా వేచి చూస్తున్న సమయంలో కొందరు తన వద్దకు వచ్చారని అనుపమ చెప్పారు. మొదట మాట్లాడేందుకు ప్రయత్నించి, ఆ తర్వాత తన అనుమతి లేకుండానే ఫొటోలు తీయడం మొదలుపెట్టారని వివరించారు. క్షణాల్లో జనం తనను చుట్టుముట్టారని, ఫొటోలు తీస్తూ తనను తాకారని, ఆ సమయంలో ఏం చేయాలో పాలుపోలేదని ఆమె పేర్కొన్నారు.అభిమానులతో ఫొటోలు దిగడానికి తనకు ఎలాంటి అభ్యంతరం లేదని అనుపమ స్పష్టం చేశారు. అయితే, కొందరు ప్రవర్తించే తీరు, హద్దులు మీరడం ఆందోళన కలిగిస్తుందన్నారు.

ఇలాంటి సమయాల్లో ఎవరు ఎలా ప్రవర్తిస్తారో, ఎక్కడ తాకుతారో తెలియక భయమేస్తుందని ఆమె అన్నారు. నటీనటుల వృత్తి జీవితంలో అభిమానులతో ఫొటోలు దిగడం సాధారణమే అయినా, కచ్చితంగా కొన్ని హద్దులు పాటించాలని సూచించారు. సమాజంలో సాధారణ మహిళలు కూడా ఇలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి ధైర్యాన్ని మెచ్చుకోవాలని అనుపమ పేర్కొన్నారు.

# రోడ్ ట్రిప్ నేపథ్య కథాంశంతో..

'ఒకే ఒక జీవితం'ఫేం శ్రీకార్తీక్ దర్శకత్వంలో రుక్మిణి వసంత్ కథానాయికగా ఓ చిత్రం తెరకెక్కనున్నది. రోడ్ ట్రిప్ నేపథ్యంలో కామెడీ డ్రామా ఇది. సిరుని సినీ కార్పొరేషన్, మ్యాడ్‌బాయ్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన అనౌన్స్‌మెంట్ వీడియోను మేకర్స్ విడుదల చేశారు. ఇందులో రుక్మిణి వసంత్ 'తారా' అనే పాత్రలో నటిస్తున్నట్టు ఈ వీడియో ద్వారా పేర్కొన్నారు. దర్శకుడు శ్రీకార్తీక్, నటులు దేవ్ రామనాథ్, వినాయక్ వైద్యనాథన్‌లు సరదాగా సంభాషించుకుంటూ తారగా రుక్మిణి వసంత్‌ను పరిచయం చేశారు. ఏడాదిన్నరగా సాగిన ఈ సినిమా ప్రయాణాన్ని ప్రతిబింబించేలా ఈ అనౌన్స్‌మెంట్ వీడియో సాగింది. త్వరలోనే ఈ సినిమా టైటిల్‌ను కూడా ప్రకటించనున్నారు.



# పూజ కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైన 'ఓస్కార్ మిస్సింగ్'!



శ్రీమతి మాత రాజేశ్వరి సమర్పణలో భూమాత ఆర్ట్స్ పతాకంపై పసుపులేటి రాధాకృష్ణ, శివాని జంటగా చంద్రమౌళి పి.జి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'ఓస్కార్ మిస్సింగ్'. పవన్ మాత, నితిన్ మాత నిర్మాతలుగా వ్యవహరిస్తున్న ఈ సినిమా పూజ కార్యక్రమాలతో అత్యంత వైభవంగా ప్రారంభమైంది.ఈ చిత్ర ప్రారంభోత్సవ వేడుక సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ, ఈ సినిమా మంచి కామెడీ ఎంటర్టైనర్‌గా ప్రేక్షకులను అలరిస్తుందని తెలిపారు. ఇందులో కొన్ని నిజ జీవిత పాత్రలు కూడా చోటుచేసుకుంటాయని, సినిమా ఆద్యంతం హాస్యభరితంగా ప్రేక్షకులను నవ్వించడమే ధ్యేయంగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు చిత్ర దర్శక నిర్మాతలు వెల్లడించారు. ఈ సినిమా షూటింగ్‌ను రెండు షెడ్యూల్స్‌లో పూర్తి చేసి, డిసెంబర్ చివరి నాటికి షూటింగ్ ముగించుకుని వీలైనంత త్వరగా ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తామని చిత్ర బృందం తెలిపింది. ఈ చిత్రంలో అలీ, చిత్రం శ్రీను, బిత్తిరి సత్తి, జబర్దస్త్ ఫణి, రాము, దుర్గారావు, శోభ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

# వెంకీ-త్రివిక్రమ్ 'ఆదర్శ కుటుంబం'..




విక్టరీ వెంకటేశ్ అభిమానులకు, సినీ ప్రియులకు చిత్రబృందం తీపి కబురు అందించింది. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఆదర్శ కుటుంబం' చిత్ర ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. స్టార్ డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో వెంకటేశ్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ హారిక అండ్ హాసిని క్రియేషన్స్ నిర్మిస్తోంది. 'ఏకే-47' అనే ఆసక్తికరమైన ట్యాగ్‌లైన్‌తో వస్తున్న ఈ సినిమా ట్రైలర్ ప్రస్తుతం యూట్యూబ్‌లో అందుబాటులోకి వచ్చింది. ఇవాళ హైదరాబాద్ లో జరిగిన ఈవెంట్ లో ట్రైలర్ ను ఆవిష్కరించారు. ట్రైలర్ విడుదలను ప్రకటిస్తూ చిత్ర నిర్మాణ సంస్థ ఒక సరికొత్త పోస్టర్‌ను విడుదల చేసింది. ఇందులో వెంకటేశ్ ఎరుపు రంగు చొక్కా, స్టైలిష్ కళ్లద్దాలతో చిరునవ్వు చిందిస్తూ ఎంతో ఆహ్లాదకరంగా కనిపిస్తున్నారు. ఆయనతో పాటు ఇతర ప్రధాన తారాగణం కూడా ఈ పోస్టర్‌లో మెరిశారు. 'ట్రైలర్ అవుట్ నౌ' అనే క్యాప్షన్‌తో కూడిన ఈ పోస్టర్ సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచేసింది. ఈ చిత్రం ఫ్యామిలీ ఎమోషన్స్, వినోదం, యాక్షన్ అంశాల కలయికగా రూపొందిందని చిత్ర బృందం పేర్కొంది. త్రివిక్రమ్ శైలి సంభాషణలు, వెంకటేశ్ మార్క్ కామెడీ టైమింగ్, కుటుంబ సెంటిమెంట్‌తో పాటు ఆకట్టుకునే యాక్షన్ సన్నివేశాలు ఈ చిత్రంలో ప్రధాన ఆకర్షణగా నిలవనున్నట్లు ట్రైలర్ ద్వారా స్పష్టమవుతోంది. వైవిధ్యభరితమైన కథాంశంతో వస్తున్న ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను రంజింపజేస్తుందని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది. ప్రస్తుతం ఈ ట్రైలర్ యూట్యూబ్‌లో రికార్డు స్థాయి వ్యూస్‌తో దూసుకుపోతోంది. వైవిధ్యమైన పాత్రలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే వెంకటేశ్, తనదైన శైలిలో వెండితెరపై మ్యాజిక్ చేసే త్రివిక్రమ్ కాంబినేషన్‌లో సినిమా వస్తుండటంతో అంచనాలు భారీగా ఉన్నాయి. 'ఆదర్శ కుటుంబం' చిత్రాన్ని అక్టోబర్ 30న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో ఘనంగా విడుదల చేయనున్నట్లు నిర్మాతలు ఇప్పటికే అధికారికంగా ప్రకటించారు.

# బంధాన్ని నిలబెట్టేది నమ్మకమే



'కొత్త బంగారులోకం' జంట వరుణ్ సందేశ్, శ్వేతా బసు ప్రసాద్ జంటగా నటించిన చిత్రం 'నా వైఫ్ మిస్సింగ్'. స్వాతి ప్రకాష్ మంత్రిప్రగడ దర్శకత్వంలో శివ కంఠంనేని నిర్మించిన ఈ చిత్రం శుక్రవారం నుంచి ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ ఆహాలో స్ట్రీమింగ్ అవుతున్నది. ఈ సందర్భంగా ఈ సినిమా ప్రీమియర్, ప్రెస్‌మీట్‌ను హైదరాబాద్‌లో నిర్వహించారు. సీనియర్ నటుడు మురళీమోహన్, అగ్ర దర్శకుడు హరీశ్‌శంకర్ ఈ కార్యక్రమానికి అతిథులుగా విచ్చేసి చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. 'నమ్మకమే బంధాన్ని నిలబెడుతుంది అనే విషయాన్ని తెలియజెప్పే కథాంశంతో ఈ సినిమా రూపొందింది. శ్వేతాబసుతో ఇన్నేళ్ల తర్వాత కలిసి నటించడం ఆనందంగా ఉంది' అని వరుణ్‌సందేశ్ అన్నారు. ఈ సినిమాను గ్రేట్ కంబ్యాక్‌గా ఫీలవుతున్నానని, ఇన్నేళ్ల తర్వాత టాలీవుడ్‌కి తిరిగి రావడం నా సొంత

# ఓ సైనికుడి తిరుగుబాటు



ప్రభాస్ కథానాయకుడిగా హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న పీరియడ్ యాక్షన్ డ్రామా 'ఫౌజీ'. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణంలో టీ-సిరీస్ సమర్పణలో రూపొందుతున్న ఈ చిత్రంలో ఇమాన్వి కథానాయికగా నటిస్తున్నారు. శుక్రవారం ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా చిత్రబృందం 'ఫైల్ నంబర్ 25' పేరుతో ప్రత్యేక గ్లింప్స్‌ను విడుదల చేసింది. రెండో ప్రపంచ యుద్ధం నేపథ్యంలో సాగే ఈ కథలో 1942లో బెర్లిన్‌లో నేతాజీ సుభాష్ చంద్రబోస్, అడాల్ఫ్ హిట్లర్ మధ్య జరిగిన సమావేశాన్ని చూపించారు. భారత స్వాతంత్ర్య పోరాటానికి జర్మనీ మద్దతు కోరే క్రమంలో నేతాజీ ఓ రహస్య భారతీయ సైనికుడి గురించి వెల్లడిస్తారు. బ్రిటిష్ నిఘా వ్యవస్థను తన వ్యూహాలతో ముప్పుతిప్పలు పెడుతూ, సైనిక కార్యకలాపాలను దెబ్బతీస్తున్న ఆ వీరుడి అసలు గుర్తింపు ఎవరికీ తెలియదు. భగవద్గీత స్ఫూర్తితో రూపొందించిన రహస్య సమాచార వ్యవస్థ అతడి ప్రత్యేకతగా గ్లింప్స్‌లో చూపించారు.చివర్లో ప్రభాస్ భారీ తుపాకీతో, సిగరెట్ నోటిలో పెట్టుకుని కనిపిస్తూ తనదైన మాస్ యాక్షన్‌తో ఆకట్టుకున్నారు. బ్రిటిష్ పాలనకు తలొగ్గని తిరుగుబాటుదారుడిగా ఆయన పాత్ర ఆసక్తిని పెంచుతోంది.ఈ చిత్రం వచ్చే ఏడాది మార్చి 29న తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళం, బెంగాలీ భాషల్లో విడుదల కానుంది.

# వివిధ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి

**రైతులకు పంట నష్టానికి ఎకరాకు రూ.30 వేల పరిహారం చెల్లించాలి**

**ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి డిమాండ్**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ )మెదక్ జిల్లా కొల్చారం మండలంలోని కొంగోడు, అంశానిపల్లి, వసురం తండా, కొల్చారం, వరిగుంతం, పోతంశెట్టిపల్లి, అప్పాజీపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా అన్యాయం చేస్తోందని విమర్శించారు. వ్యవసాయానికి సరిపడా విద్యుత్ సరఫరా లేక రైతులు సాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. పంటలు ఎండిపోయిన రైతులకు ఎకరానికి రూ.30 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులకు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అండగా ఉంటూ ప్రభుత్వాన్ని నిలదీస్తామని తెలిపారు. అనంతరం అంశానిపల్లి, నాయిని జలాల్పూర్ గ్రామాల్లో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల వద్ద కొబ్బరికాయ కొట్టి భూమిపూజ చేశారు. నాయిని జలాల్పూర్ మాజీ సర్పంచ్ తనయుడు కర్రె పెద్ద సంజీవులుకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడంతో ఎమ్మెల్యేకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస చారి, డిప్యూటీ తహసీల్దార్ నాగవర్ధన్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సుమలత, ఏఈఓ గౌతమి, జీపీఓలు సత్యనారాయణ, పద్మ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గౌరీశంకర్ గుప్తా, కొల్చారం మండలం బిఆర్ఎస్ పార్టీ యువజన అధ్యక్షులు సంతోష్ రావు పార్టీ నాయకులు ముత్యం గారి సంతోష్ కుమార్, ఉదయ వేమారెడ్డి, సొసైటీ చైర్మన్లు నాగూరి మనోహర్, చిన్నారపు ప్రభాకర్, పలువురుప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ కార్యాలయాల్లో టీ-ఫైబర్ సేవలకు అందుబాటులోకి తీసుకురావాలి

**కలెక్టర్ ప్రతిమసింగ్**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) కలెక్టర్ కార్యాలయంలో మెదక్ జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాల్లో టీ ఫైబర్ ఇంటర్నెట్ ఏర్పాటు చేయడంపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ..తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఐటీ శాఖ ఆదేశాల మేరకు ప్రైవేట్ ఇంటర్నెట్లను తొలగించి టి ఫైబర్ ఇంటర్నెట్ మారాలని ఆదేశాల మేరకు సంబంధిత అధికారులతో సమీక్షించడం జరిగిందన్నారు .ఇంటర్నెట్ వినియోగం, వాటి సామర్థ్యం అన్ని ప్రభుత్వ కార్యాలయాలనుంచి సమగ్ర అంచనాల రూపొందించుకొని ఇంటర్నెట్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డి ఎఫ్ వో జోజి,ఈ.డీ.ఎం సందీప్,తదితరులు పాల్గొన్నారు.

# నర్సాపూర్ మున్సిపల్ మేనేజర్ కు సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేసిన

**సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కడారి నాగరాజు**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) నర్సాపూర్ తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ & ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో నర్సాపూర్ మున్సిపల్ మేనేజర్ కు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కడారి నాగరాజు మాట్లాడుతూ..గత 4 సంవత్సరాలుగా మున్సిపల్ కార్మికులకు పెండింగ్ లో ఉన్న 2వ పీఆర్సీని వెంటనే ప్రకటించాలని, కనీస వేతనం రూ.30,000/-గా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులకు హెల్త్, సేఫ్టీ లేదని, మరణించిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగం కల్పించాలని, పట్టాదారులకు అనుగుణంగా నియామకాలు చేపట్టాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా 60 వేల మందికి పైగా మున్సిపల్ కార్మికులు ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నారని, వారికి ఉద్యోగ భద్రత, హెల్త్ సౌకర్యాలు లేవని, ప్రమాదాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.
కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మున్సిపల్ కార్మికుల వేతనాలు పెంచుతామని ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చినా, 3 సంవత్సరాలు గడుస్తున్నా హామీలు అమలు కాలేదని విమర్శించారు. ఈ డిమాండ్ల సాధన కోసం 2026 అక్టోబర్ 26న (చలో హైదరాబాద్) రాష్ట్రవ్యాప్త పోరాటానికి తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ & ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీపిలుపునిచ్చిందని, ఈ పోరాటంలో భాగస్వామ్యం కావడానికి అనుమతి ఇవ్వాలని మున్సిపల్ మేనేజర్ ను కోరినట్లు తెలిపారు. డిమాండ్లుపరిష్కరించకపోతే భవిష్యత్తులో పెద్ద ఎత్తునఆందోళనలుచేపడతామనిహెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పుష్ప, రాములు, అనిత, అశోక్ , మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

## రక్షణ పిల్లలు సమస్యలపై అధికారులకు వినతి పత్రం అందించిన ఎ . పి.జె.అబ్దుల్ కలాం బాలల పార్లమెంట్ సభ్యులు



శ్రీశైలం (ప్రశ్నన్యూస్) తాడేపల్లి మండలం కొలనుకొండ గ్రామంలో ది 24-10-2026న గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ సిస్టర్స్ వారి చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ఎ.పి.జె.అబ్దుల్ కలాం బాలల పార్లమెంట్ గ్రూప్ సమావేశం జరిగినది. ఈ సమావేశంలో సభ్యులు గ్రామంలో ఉన్న,సమస్యలను, పిల్లలకు కావాల్సిన, ప్రభుత్వం కల్పించే వసతుల గురించి సచివాలయం సిబ్బంది కి వినతి పత్రం అందించారు. ప్రతీనెలా జరిగే ఈబాలల పార్లమెంట్ సమావేశంలో పిల్లలు ఇలా చర్చించి, కొన్ని సందర్భాలలో విలేజ్ చైల్డ్ ప్రొటెక్షన్ కమిటి సభ్యుల సహకారంతో అధికారులను సంప్రదిస్తున్నారు. ఈ సమావేశంలో అత్తోట పోతురాజు మాట్లాడుతూ పిల్లల సర్వతో ముఖాభివృద్ధిలో గ్రంథాలయాలు చాలా కీలక పాత్ర పోషిస్తాయని, పుస్తకాలు చదవడం వల్ల పిల్లలలో ఆలోచనా శక్తి, సృజనాత్మకత, జ్ఞానం, భాషా నైపుణ్యాలు పెరుగుతాయని, లైబ్రరీలలో రకరకాల పుస్తకాలు ఉంటాయి కాబట్టి అవి చదవడం వల్ల పిల్లల పదజాలం పెరిగి భాషపై పట్టు వస్తుందని చదువు పై ఏకాగ్రత,ఆలోచనా శక్తి మెరుగౌతాయని ఒక చోట కూర్చుని పుస్తకం చదవడం వల్ల పిల్లల్లో ఏకాగ్రత పెరుగుతుంది, కథల్లోని పాత్రల ద్వారా మంచి,చెడులను విశ్లేషించే సామర్థ్యం అలవడుతుందని, సృజనాత్మకత పెంపొందుతుందని కామిక్స్, కథలపుస్తకాలు, సైన్స్ ఫిక్షన్ వంటివి చదవడం వల్ల పిల్లల ఊహాశక్తి అపరిమితంగా పెరుగుతుంది. వారు కొత్త విషయాలను ఊహించడం మొదలుపెడతారు, క్రమశిక్షణ, బాధ్యత అలవడతాయి, లైబ్రరీలో నిశ్శబ్దంగా ఉండటం,పుస్తకాలను జాగ్రత్తగాచూసుకోవడం, తీసుకున్న పుస్తకాన్ని సకాలంలో తిరిగి ఇవ్వడం వంటి నియమాల ద్వారా పిల్లల్లో చిన్నతనం నుంచే బాధ్యతాయుత ప్రవర్తన అలవడుతుందని ఈ రోజుల్లో పిల్లలు ఎక్కువగా మొబైల్ ఫోన్లు,టీవీలకు అలవాటు పడుతున్నారు. లైబ్రరీకి వెళ్లడం వల్ల స్క్రీన్ టైమ్ తగ్గి, కంటికి, మనస్సుకు మేలు జరుగుతుంది కాబట్టి కనీసం వారానికి ఒక్కసారైనా పిల్లలు లైబ్రరీకి వెళ్ళి ఉత్తమ పౌరులుగా ఎదగాలని తెలిపారు. అందువల్ల లైబ్రరీ వల్ల ఉన్న ప్రయోజనాలు గురించి తెలుసుకొని పిల్లలు గ్రామంలో ఒక లైబ్రరీ ఏర్పాటు చేయమని అప్పటి వరకు కనీసం 2,3 దిన పత్రికలు పిల్లల కోసం వేయించమని మహిళా పోలీస్ రాధిక కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గుడ్ షెఫర్డ్ సిబ్బంది అత్తోట పోతురాజు,మహిళా పోలీస్ రాధిక,ఆశా వర్కర్లు,బాలల పార్లమెంట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# బీజేవైఎం వైస్ ప్రెసిడెంట్‌గా పంతంగి హర్ష యాదవ్



కూకట్ పల్లి(ప్రశ్న న్యూస్)భారతీయ జనతా పార్టీ యువజన విభాగం భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) రంగారెడ్డి అర్బన్ జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా పంతంగి హర్ష యాదవ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా పంతంగి హర్ష యాదవ్ మాట్లాడుతూ, తన నియామకానికి సహకరించిన శేరిలింగంపల్లి మాజీ ఎమ్మెల్యే అభ్యర్థి రవికుమార్ యాదవ్, బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాసరెడ్డికి, రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి తోపుకొండ మైపాల్ రెడ్డికి, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు కుందే గణేష్‌కు, జిల్లా యువమోర్చా అధ్యక్షుడు పొట్లపల్లి సాయికుమార్ గౌడ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని, యువతను పార్టీ సిద్ధాంతాల వైపు ఆకర్షిస్తూ బీజేవైఎంను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని హర్ష యాదవ్ పేర్కొన్నారు. యువత సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, భారతీయ జనతా పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు.

# ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి 100 బ్యాగుల సిమెంట్ విరాళం

**సొంత నిధులతో ముందుకొచ్చిన బీజేపీ సీనియర్ నాయకుడు..**

**రామన్నగారి శ్రీనివాస్ గౌడ్ ఆలయ నిర్మాణానికి చేయూత**




మేడ్చల్ (ప్రశ్న న్యూస్) కిష్టాపూర్ డివిజన్ పరిధిలోని శ్రీ ఎల్లమ్మ దేవాలయ నిర్మాణానికి బీజేపీ సీనియర్ నాయకుడు రామన్నగారి శ్రీనివాస్ గౌడ్ తన సొంత నిధులతో 100 బ్యాగుల సిమెంట్‌ను విరాళంగా అందజేశారు. ఆలయ నిర్మాణానికి సహకరించాలన్న స్థానిక ప్రజల విజ్ఞప్తికి స్పందిస్తూ ఈ సహాయాన్ని అందించారు. కిష్టాపూర్-పూడూర్ డివిజన్ ప్రజలు మేడ్చల్--మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను శ్రీ ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి సహాయం చేయాలని కోరారు. ఈ నేపథ్యంలో ఆలయ నిర్మాణానికి తన వంతు సహకారం అందించాలనే ఉద్దేశంతో శ్రీనివాస్ గౌడ్ ముందుకొచ్చి, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యురాలు రాములమ్మకు 100 బ్యాగుల సిమెంట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ..
సమాజ అభివృద్ధిలో దేవాలయాలు, పాఠశాలలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. దేవాలయాలు ఆధ్యాత్మిక విలువలను పెంపొందిస్తే, పాఠశాలలు విద్య ద్వారా ప్రజల భవిష్యత్తుకు బాటలు వేస్తాయని పేర్కొన్నారు. ప్రజోపయోగ కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు చెరువుకొమ్ము శ్రీనివాస్ గౌడ్, రతన్ రాథోడ్, గోపు నాగరాజు, ఒగ్గు భాస్కర్, అభినవ్ గౌడ్, చారీ, దొడ్ల మోహన్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# జగిత్యాల జిల్లాలో టపాకాయల దుకాణాలపై నిఘా

**నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు**

**- పేలుడు పదార్థాల చట్టం-1884 ప్రకారం**

**భద్రతా ప్రమాణాలు తప్పనిసరి**

**దీపావళి వేళ ప్రమాదాల నివారణకు ముందస్తు జాగ్రత్తలు**

**జిల్లా ఫైర్ సేఫ్టీ అధికారి కృష్ణకాంత్ హెచ్చరిక**



జగిత్యాల(ప్రశ్న న్యూస్) దీపావళి పండుగ సందర్భంగా టపాకాయల విక్రయాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు అప్రమత్తమయ్యారు. టపాకాయల దుకాణాలు ఏర్పాటు చేసే వ్యాపారులు, నిర్వాహకులు భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని జగిత్యాల జిల్లా ఫైర్ సేఫ్టీ అధికారి కృష్ణకాంత్ సూచించారు. అనుమతులు లేకుండా దుకాణాలు ఏర్పాటు చేసినా, నిబంధనలను ఉల్లంఘించినా సంబంధిత చట్టాల ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉందని స్పష్టం చేశారు.

## లైసెన్స్ లేకుండా విక్రయాలు చేయొద్దు

టపాకాయల తయారీ, నిల్వ, విక్రయాల నియంత్రణకు సంబంధించి పేలుడు పదార్థాల చట్టం-1884, పేలుడు పదార్థాల నిబంధనలు-2008 ప్రకారం వర్తించే నిబంధనలను వ్యాపారులు కచ్చితంగా పాటించాలి. సంబంధిత అధికారుల నుంచి అవసరమైన అనుమతులు, లైసెన్సులు పొందిన తర్వాతే టపాకాయల దుకాణాలను ఏర్పాటు చేయాలి. లైసెన్స్‌లో అనుమతించిన ప్రాంగణంలోనే విక్రయాలు నిర్వహించాలని, అనుమతించిన పరిమాణానికి మించి టపాకాయలను నిల్వ చేయరాదని సూచించారు.

## దుకాణాల మధ్య దూరం తప్పనిసరి

తాత్కాలిక టపాకాయల దుకాణాలను ఏర్పాటు చేసేటప్పుడు భద్రతా ప్రమాణాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. వర్తించే నిబంధనల ప్రకారం దుకాణాల మధ్య కనీసం 3 మీటర్ల దూరం, రక్షిత నిర్మాణాల నుంచి కనీసం 15 మీటర్ల దూరం ఉండేలా చూడాలి. షెడ్లు ఒకదానికొకటి ఎదురెదురుగా ఏర్పాటు చేయకూడదు. తాత్కాలిక దుకాణాలకు సంబంధిత లైసెన్స్ తప్పనిసరని, దాని కాలపరిమితి, ఇతర షరతులను పాటించాలని అధికారులు సూచించారు.

## అగ్నిప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

టపాకాయల దుకాణాల వద్ద ఆయిల్ ల్యాంపులు, గ్యాస్ ల్యాంపులు, బహిరంగ మంటలను ఉపయోగించకూడదు. విద్యుత్ దీపాలు, వైరింగ్‌ను సురక్షితంగా ఏర్పాటు చేయడంతోపాటు షార్ట్ సర్క్యూట్, స్పార్క్‌లు ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రతి దుకాణం వద్ద ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు, ఇసుక బకెట్లు, అవసరమైన అగ్నిమాపక సదుపాయాలను సిద్ధంగా ఉంచుకోవాలి. దుకాణాల వద్ద ధూమపానం, అగ్గిపెట్టెలు, లైటర్లు, ఇతర మండే వస్తువులను అనుమతించకూడదు. ప్రజలు అధికంగా గుమిగూడకుండా తగిన ఏర్పాట్లు చేయాలి. అగ్నిమాపక వాహనాలు, అంబులెన్స్‌లు సులభంగా చేరుకునేలా దుకాణాల పరిసరాల్లో రాకపోకలకు ఆటంకం లేకుండా చూడాలని సూచించారు.

## నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు

టపాకాయలను అనుమతించిన పరిమాణంలోనే నిల్వ చేయాలని, లైసెన్స్ నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు నిర్వహించరాదని అధికారులు స్పష్టం చేశారు. భద్రతా ప్రమాణాలను నిర్లక్ష్యం చేయడం వల్ల అగ్నిప్రమాదాలు సంభవించి ప్రాణ, ఆస్తి నష్టం జరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై సంబంధిత చట్టాల ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉందని తెలిపారు.

## అత్యవసర పరిస్థితుల్లో అప్రమత్తత అవసరం

టపాకాయల దుకాణాల నిర్వాహకులు సమీపంలోని ఫైర్ స్టేషన్, పోలీస్ స్టేషన్, అంబులెన్స్ సేవల వివరాలను అందుబాటులో ఉంచుకోవాలి. అగ్నిప్రమాదం సంభవించినప్పుడు ప్రజలను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించి, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించాలి. దీపావళి పండుగను సురక్షితంగా జరుపుకోవడమే ప్రధాన లక్ష్యంగా వ్యాపారులు, దుకాణ నిర్వాహకులు అన్ని భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటించాలని జిల్లా ఫైర్ సేఫ్టీ అధికారి కృష్ణకాంత్ సూచించారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యమిస్తూ ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

# సీఎంఆర్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థిని ఆత్మహత్య



మేడ్చల్( ప్రశ్న న్యూస్ ) మేడ్చల్ జిల్లా కండ్లకోయాలోని సీఎంఆర్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థిని తాను ఉంటున్న ఓ ప్రైవేట్ హాస్టల్ లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కండ్లకోయాలోని సీఎంఆర్ ఐటి కళాశాలలో బీటెక్ ఈసీఈ రెండో సంవత్సరం చదువుతున్న జంగిటి అక్షయ (19) ఓ ప్రైవేట్ హాస్టల్ లో ఉంటూ తన గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి గ్రామానికి చెందిన అక్షయ కండ్లకోయాలోని సీఎంఆర్ ఐటి కళాశాలలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతుంది. కళాశాలకు సమీపంలో ఉన్న ముకుంద అనే ప్రైవేట్ హాస్టల్ లో ఉంటూ చదువుకుంటున్న ఈ విద్యార్థిని తన గదిలో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య కు పాల్పడినట్లు పోలీసులు పేర్కొన్నారు. సమాచారం అందుకున్న మేడ్చల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ మహేందర్ ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. విద్యార్థిని మృతికి కారణాలు ఏంటో తెలియరాలేదు. మేడ్చల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# శేరిలింగంపల్లి టిఆర్ఎస్ మహిళా విభాగం

**- అధ్యక్షురాలిగా గూడ లావణ్య నేత నియామకం**

**- నియామకం పత్రం అందజేసిన వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్**




శేరిలింగంపల్లి (ప్రశ్న న్యూస్) తెలంగాణ రక్షణ సేన శేరిలింగంపల్లి నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలిగా గూడ లావణ్య నేత నియమితులయ్యారు. తనకు ఈ బాధ్యతలు అప్పగించిన నియోజకవర్గ ఇన్‌చార్జి వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అధినేత్రి కవిత ఆశయాలకు అనుగుణంగా, వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్ నాయకత్వంలో పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని లావణ్య నేత పేర్కొన్నారు. నియోజకవర్గంలోని మహిళలను ఏకతాటిపైకి తీసుకువచ్చి, వారి సాధికారతతో పాటు సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేస్తానని ఆమె పేర్కొన్నారు.

# ధరల సెగతో పేదోడి విలవిల

**- కొనలేడు.. కొన్నా కడుపునిండా తినలేడు- బియ్యం నుంచి పప్పుల వరకు, కూరగాయల నుంచి వంటనూనె వరకు ధరల పోటు**

**- ఆదాయం అంతంతే.. ఖర్చులు కొండంత, సామాన్యుడి నెలవారీ బడ్జెట్ తలకిందులు - మార్కెట్‌లో ధరల మంటలు.. సామాన్యుడికి తప్పని తిప్పలు**

(తోట వెంకట్ - ప్రశ్న న్యూస్ బ్యూరో)




ఆకాశాన్నంటుతున్న నిత్యావసరాల ధరలు.. కుంచించుకుపోతున్న సామాన్యుడి కొనుగోలు శక్తి.. రోజురోజుకూ భారమవుతున్న కుటుంబ బడ్జెట్, ఒకప్పుడు వారానికి సరిపడా కూరగాయలు కొనుగోలు చేసిన డబ్బుతో ఇప్పుడు సంచి నిండా సరుకులు రావడం లేదనే ఆవేదన వినిపిస్తోంది. బియ్యం, పప్పులు, ఉప్పు, వంటనూనె, కూరగాయలు.. ఏది కొనాలన్నా ధరల లెక్కలు వేయాల్సిన పరిస్థితి. మార్కెట్‌కు వెళ్తే జేబు ఖాళీ.. ఇంటికి వస్తే సంచి ఖాళీ, రెక్కలు ముక్కలు చేసుకుని సంపాదించినా కుటుంబ అవసరాలు తీరడం కష్టంగా మారుతోందని పరిమిత ఆదాయం కలిగిన కుటుంబాలు వాపోతున్నాయి. కూలీ పెరగదు.. జీతం పెరగదు.. కానీ ఖర్చులు మాత్రం పెరుగుతూనే ఉంటే సామాన్యుడు బతకడం ఎలా? పేదవాడి పళ్లెంలో అన్నం ఉండాలి.. అందులో పప్పు, కూర ఉండాలి. కానీ వాటి ధరలే భారమైతే కుటుంబాలు తమ అవసరాలను ఎలా తీర్చుకోవాలి.? నిత్యావసరాల ధరలపై సమీక్ష, మార్కెట్ పర్యవేక్షణ, సరసమైన ధరలకు సరుకుల సరఫరా.. ఇవన్నీ ఇప్పుడు కీలకంగా మారాయి.

## బడ్జెట్ బేజారు.. బతుకు భారమే

రోజువారీ కూలీపై ఆధారపడే కార్మికుడు, చిన్న ఉద్యోగి, ఆటో డ్రైవర్, చిరు వ్యాపారి, ఇలా పరిమిత ఆదాయంతో జీవించే కుటుంబాలకు ప్రతి రూపాయి విలువైనదే. నెల ప్రారంభంలో వచ్చిన జీతం లేదా కూలీ డబ్బును ఇంటి అద్దె, విద్యుత్ బిల్లు, పిల్లల చదువులు, ప్రయాణ ఖర్చులు, మందుల కోసం పంచాల్సి ఉంటుంది. మిగిలిన మొత్తంతో నెలంతా సరుకులు కొనుగోలు చేయాలి. నిత్యావసరాల ధరలు పెరిగితే ఈ లెక్కలన్నీ తారుమారవుతున్నాయి.ఒక కుటుంబానికి నెలకు ఎంత బియ్యం అవసరం? పప్పులు ఎంత కొనాలి.? వంటనూనె ఎంతకాలం సరిపోతుంది.? వారానికి ఎన్ని కూరగాయలు కొనాలి.? అనే ప్రశ్నలకు సమాధానాలు వెతుక్కోవాల్సి వస్తోంది. అవసరమైన సరుకులన్నీ ఒకేసారి కొనలేక కొన్నింటిని వాయిదా వేయడం, కొనుగోలు పరిమాణాన్ని తగ్గించుకోవడం వంటి పరిస్థితులు ఎదురవుతున్నాయి.పిల్లలకు పౌష్టికాహారం అందించాలన్నా, వృద్ధులకు అవసరమైన ఆహారం సమకూర్చాలన్నా ఖర్చుల భారం అడ్డుపడుతోంది. ఆదాయంలో పెరుగుదల లేకుండా ఖర్చులు పెరుగుతుంటే కుటుంబాల పొదుపు కరిగిపోవడం, అవసరాలకు అప్పులు చేయాల్సి రావడం వంటి ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉంది. సంపాదన పరిమితం.. అవసరాలు అపరిమితం, ధరల భారాన్ని మోయలేక సామాన్యుడి కుటుంబ బడ్జెట్ కుదేలవుతోంది.

## కూరగాయల మార్కెట్‌కు వెళ్తేనే గుండె గుబేల్..

టమాటా, ఉల్లిపాయ, పచ్చిమిర్చి, వంకాయ, బెండకాయ, దొండకాయ, ఆకుకూరలు.. ఇవి ప్రతి ఇంటి వంటలో కనిపించే సాధారణ పదార్థాలు. అయితే మార్కెట్‌లో ధరలు పెరిగినప్పుడు వాటి ప్రభావం నేరుగా కుటుంబ ఖర్చులపై పడుతుంది. ఒకప్పుడు రెండు మూడు రకాల కూరగాయలు కొనేవారు ఇప్పుడు ఒకటి లేదా రెండు రకాలతోనే సరిపెట్టుకోవాల్సి వస్తోందని పలువురు వినియోగదారులు చెబుతున్నారు.కిలో ఉల్లిపాయలు రూ.60 నుంచి రూ.80 వరకు పలుకుతున్నాయని వినియోగదారులు పేర్కొంటున్నారు. అయితే ప్రాంతం, నాణ్యత, విక్రయ కేంద్రాన్ని బట్టి ధరలు మారవచ్చు. అందువల్ల స్థానిక మార్కెట్లలో ధరలను నిర్ధారించడం అవసరం. అయినప్పటికీ కూరగాయల ధరల్లో వచ్చే మార్పులు పరిమిత ఆదాయం కలిగిన కుటుంబాలపై గణనీయమైన ప్రభావం చూపుతాయి.
కూరగాయల ధరలు పెరిగినప్పుడు రైతుకు అదే స్థాయిలో ప్రయోజనం దక్కుతోందా? లేక రవాణా, నిల్వ, మధ్యవర్తుల మార్జిన్ల కారణంగా వినియోగదారుడిపై భారం పెరుగుతోందా? అనే అంశాలను పరిశీలించాలి. పంట దిగుబడులు, వాతావరణ పరిస్థితులు, సరఫరా, డిమాండ్ వంటి అంశాలూ ధరలపై ప్రభావం చూపుతాయి. కాబట్టి ధరల పెరుగుదలకు కారణాలను గుర్తించి తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.రైతుకు గిట్టుబాటు ధర దక్కాలి.. వినియోగదారుడికి అందుబాటు ధరకు కూరగాయలు లభించాలి, ఈ రెండింటి మధ్య సమతుల్యత సాధించడమే లక్ష్యం కావాలి.

## కందిపప్పు ధర కాటు.. నూనె ప్యాకెట్ భారం..

అన్నంతో పాటు పప్పు ఉంటేనే భోజనం పూర్తయిందనే భావన అనేక కుటుంబాల్లో ఉంది. కందిపప్పు, మినపప్పు, పెసరపప్పు, శనగపప్పు వంటి వాటి ధరలు పెరిగితే కుటుంబాలు కొనుగోళ్లను తగ్గించుకునే పరిస్థితి ఏర్పడుతుంది. పప్పుల వినియోగం తగ్గితే ముఖ్యంగా పిల్లలు, వృద్ధులకు అవసరమైన పోషకాహారంపై ప్రభావం పడే అవకాశం ఉంది.మరోవైపు వంటనూనె ధరలూ కుటుంబ బడ్జెట్‌లో ముఖ్యమైన భాగంగా మారుతున్నాయి. వంటనూనె ప్యాకెట్ ధర రూ.180--200 వరకు ఉంటోందని వినియోగదారులు చెబుతున్నారు. అయితే నూనె రకం, ప్యాకెట్ పరిమాణం, బ్రాండ్, దుకాణాన్ని బట్టి ధరలు మారుతాయి. కాబట్టి ఈ ధరలను స్థానిక మార్కెట్‌లో నిర్ధారించుకోవాలి.ఒకేసారి బియ్యం, పప్పులు, నూనె, ఉప్పు, మసాలా దినుసులు కొనుగోలు చేయాల్సి వస్తే ఖర్చు గణనీయంగా పెరుగుతుంది. నెలవారీ ఆదాయంలో పెద్ద భాగం సరుకులకే ఖర్చయితే పిల్లల చదువులు, వైద్య అవసరాలు, ఇతర అత్యవసర ఖర్చులకు డబ్బు మిగలదు.నిత్యావసరాల ధరలు పెరగడం కేవలం కొనుగోలు సమస్యగా మిగలదు. అది కుటుంబాల ఆహారపు అలవాట్లను, పొదుపును, జీవన ప్రమాణాలను ప్రభావితం చేయగలదు. అందుకే ధరల పెరుగుదలపై ప్రభుత్వ శాఖలు ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహించాలి.

## బియ్యం సంచి కొనాలన్నా లెక్కలే..

పేద, మధ్యతరగతి కుటుంబాలకు బియ్యం ప్రధాన ఆహారం. బియ్యం, ఉప్పు, పప్పులు, నూనె, కూరగాయలు విలాస వస్తువులు కావు. ఇవి నిత్యం అవసరమయ్యే కనీస సరుకులు. వాటి ధరలు పెరిగితే ఇతర అవసరాల కోసం కేటాయించిన డబ్బును తగ్గించుకోవాల్సి వస్తుంది.పిల్లల స్కూలు ఫీజు చెల్లించాలా.? ఇంటికి బియ్యం కొనాలా.? అనారోగ్యంతో ఉన్న కుటుంబ సభ్యుడికి మందులు తెచ్చిపెట్టాలా.? అనే పరిస్థితి తలెత్తడం ఆందోళనకరం. కుటుంబ బడ్జెట్ సరిపోకపోతే పొదుపు సొమ్మును ఖర్చు చేయాల్సి రావచ్చు. పొదుపు లేకపోతే అప్పులపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడవచ్చు.
ప్రభుత్వాలు పేదలకు సంక్షేమ పథకాలు అందించడం ఎంత ముఖ్యమో, వారు తమ ఆదాయంతో కనీస అవసరాలను తీర్చుకోగలిగే పరిస్థితులు కల్పించడం కూడా అంతే ముఖ్యం. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అర్హులకు బియ్యం అందుతున్నప్పటికీ, ఇతర నిత్యావసరాల ధరలు కుటుంబ ఖర్చులపై ప్రభావం చూపుతూనే ఉంటాయి.
సంక్షేమం అంటే పథకాలు అందించడమే కాదు.

## ధరల నియంత్రణపై పర్యవేక్షణ ఏది.?

మార్కెట్‌లో నిత్యావసరాల ధరలు పెరుగుతున్నాయనే ఫిర్యాదులు వచ్చినప్పుడు సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టాలి. రైతుబజార్లు, హోల్‌సేల్ మార్కెట్లు, రిటైల్ దుకాణాల్లో ధరల పరిస్థితిని సమీక్షించాలి. ఒకే ప్రాంతంలో దుకాణాల మధ్య ధరల్లో వ్యత్యాసాలు ఉంటే వాటికి కారణాలను తెలుసుకోవాలి.తూకాల్లో మోసాలు, ధరల వివరాలు ప్రదర్శించకపోవడం, వినియోగదారుల నుంచి అధిక వసూళ్లు చేయడం వంటి ఉల్లంఘనలు ఉన్నాయా అనే అంశాలను తనిఖీ చేయాలి. అక్రమ నిల్వలు, కృత్రిమ కొరత సృష్టించడం వంటి ఫిర్యాదులు వస్తే ఆధారాలతో విచారణ జరిపి, తప్పు చేసినవారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి.ధరలు పెరిగిన తర్వాత మాత్రమే స్పందించడం కాకుండా, సరఫరా వ్యవస్థలో సమస్యలను ముందుగానే గుర్తించాలి. రైతుబజార్లను బలోపేతం చేయడం, అవసరమైన చోట సరసమైన ధరలకు సరుకులు అందించే ప్రత్యేక విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేయడం, మార్కెట్ ధరల వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచడం వంటి చర్యలు ఉపశమనం కలిగించవచ్చు.ధరల నియంత్రణకు సంబంధించిన చర్యలు తీసుకున్నప్పుడు వాటి ఫలితాలు ప్రజలకు కనిపించాలి. ఏ సరుకు ధర ఎంత ఉంది? ఎందుకు పెరిగింది? సరఫరాలో సమస్య ఏమిటి? దాన్ని పరిష్కరించేందుకు ఏ చర్యలు తీసుకుంటున్నారు? అనే వివరాలు స్పష్టంగా ఉండాలి.

## వ్యాపారుల లాభాలే ముఖ్యమా, వినియోగదారుడి కష్టాలు పట్టవా.?

వ్యాపారం చేయడం ప్రతి ఒక్కరి హక్కు. అయితే వినియోగదారులను మోసం చేయడం, తూకాల్లో తేడాలు చూపడం, నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరలు వసూలు చేయడం సమర్థనీయం కాదు. కొందరు వ్యాపారులు అధిక ధరలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వస్తే సంబంధిత అధికారులు వాటిని పరిశీలించి వాస్తవాలను వెల్లడించాలి.అదే సమయంలో ప్రతి ధరల పెరుగుదలకు వ్యాపారులే కారణమని భావించడం కూడా సరికాదు. ఉత్పత్తి వ్యయం, రవాణా, సరఫరా, నిల్వలు, మార్కెట్ డిమాండ్ వంటి అంశాలన్నింటినీ పరిశీలించిన తర్వాతే కారణాలను నిర్ధారించాలి. తప్పులు ఉన్నచోట చర్యలు తీసుకోవాలి. ధరల పెరుగుదలకు కారణమైన అంశాలపై ప్రజలకు స్పష్టమైన సమాచారం అందించాలి.రైతు, వ్యాపారి, వినియోగదారుడు.. ఈ మూడు వర్గాల ప్రయోజనాల మధ్య సమతుల్యత అవసరం. రైతుకు నష్టం జరగకూడదు. వ్యాపారం న్యాయబద్ధంగా సాగాలి. వినియోగదారుడికి సరసమైన ధరకు సరుకు అందాలి. ఈ లక్ష్యాలను సాధించేందుకు పారదర్శకమైన మార్కెట్ వ్యవస్థ అవసరం.

## పాలకులకు పేదోడి వంటిల్లు కనిపించడం లేదా.?

ఎన్నికల సమయంలో పేదల సంక్షేమం, ప్రజల అభ్యున్నతి, జీవన ప్రమాణాల మెరుగుదల గురించి రాజకీయ పార్టీలు హామీలు ఇస్తుంటాయి. అయితే ప్రజలు తమ రోజువారీ జీవితాల్లోనూ ఆ సంక్షేమం ప్రతిఫలించాలని ఆశిస్తారు. ముఖ్యంగా ఆహారం వంటి కనీస అవసరాల విషయంలో కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఒత్తిడికి గురికాకుండా చూడటం ప్రభుత్వాల బాధ్యత.రాష్ట్రవ్యాప్తంగా నిత్యావసరాల ధరలపై సమీక్ష నిర్వహించి, జిల్లాల వారీగా ధరల వివరాలు సేకరించాలి. రైతుబజార్ల పనితీరును పరిశీలించాలి. సరఫరాలో అంతరాయాలు ఉన్నాయా.? నిల్వలు సరిపడా ఉన్నాయా.? ధరలు ఎందుకు పెరుగుతున్నాయి.? అనే అంశాలను సంబంధిత శాఖలు విశ్లేషించాలి.

అవసరమైన చోట ప్రజలకు ఉపశమనం కలిగించే చర్యలు చేపట్టాలి. ప్రజలకు కావాల్సింది ప్రకటనలు మాత్రమే కాదు.. మార్కెట్‌కు వెళ్లినప్పుడు కనిపించే ఉపశమనం. నెలవారీ బడ్జెట్ వేసుకున్నప్పుడు మిగిలే కొంత సొమ్ము. పిల్లలకు పౌష్టికాహారం అందించగలిగే భరోసా. అప్పులు చేయకుండా కుటుంబాన్ని నెట్టుకురాగలిగే అవకాశం.

## పేదవాడి పళ్లెంలో అన్నం.. అదే అసలైన భరోసా..

నిత్యావసరాల ధరలు పెరిగినప్పుడు ఎక్కువగా ప్రభావితమయ్యేది పరిమిత ఆదాయంతో జీవించే కుటుంబాలే. ఖర్చులను తగ్గించుకునే అవకాశాలు వారికి తక్కువ. ఆహారం, మందులు, పిల్లల చదువు వంటి అవసరాలను పూర్తిగా వాయిదా వేయలేరు. అందుకే ధరల పెరుగుదల కేవలం మార్కెట్ సమస్య కాదు..

సామాజిక సంక్షేమానికి సంబంధించిన అంశం కూడా.ధరలపై సమగ్ర సమీక్ష, సరఫరా వ్యవస్థలో పారదర్శకత, అక్రమ నిల్వలపై పర్యవేక్షణ, రైతుబజార్ల బలోపేతం, సరసమైన ధరలకు సరుకుల లభ్యత.. ఇవన్నీ ప్రజలకు ఉపశమనం కలిగించగల చర్యలు. వీటిని సమర్థంగా అమలు చేయడంతోపాటు ఫలితాలను ప్రజలకు తెలియజేయాలి. ఉల్లిపాయ కొనాలన్నా లెక్క. పప్పు వండాలన్నా లెక్క. నూనె పోయాలన్నా లెక్క.. బియ్యం కొనాలన్నా లెక్క ప్రతి నిత్యావసరానికీ లెక్కలు వేసుకుంటూ పేదవాడు బతకాల్సిందేనా.?

# తిరుమలకు జలగండం.. వచ్చే వేసవికి నీటి భరోసా ఏదీ.?

**- ఐదు జలాశయాల నిల్వ సామర్థ్యం 14,305 లక్షల గ్యాలన్లు**

**- ప్రస్తుతం ఉన్నది 3,615 లక్షల గ్యాలన్లే**

**- రోజుకు 60 లక్షల గ్యాలన్ల వినియోగం.. వర్షాలపైనే ఆశలు**

**- కల్యాణి డ్యామ్ నిల్వలపైనా ఆందోళన, ఎల్‌నినో ప్రభావంపై చర్చ..**

తిరుమల(ప్రశ్న న్యూస్) కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి కొలువైన తిరుమలలో నీటి నిల్వలు ఆందోళన కలిగిస్తున్నాయి. నిత్యం వేలాది మంది భక్తులతో కిటకిటలాడే ఏడుకొండలపై తాగునీరు, వసతి సముదాయాలు, అన్నప్రసాద కేంద్రాలు, మరుగుదొడ్లు, పారిశుద్ధ్య నిర్వహణకు నీరే కీలకం. అలాంటి తిరుమలలో ఐదు ప్రధాన జలాశయాల నిల్వలు తగ్గుముఖం పట్టడం రానున్న వేసవిపై ప్రశ్నలు రేకెత్తిస్తోంది. మొత్తం 14,305 లక్షల గ్యాలన్ల నిల్వ సామర్థ్యమున్న జలాశయాల్లో అక్టోబరు 23, 2026 నాటికి సుమారు 3,615 లక్షల గ్యాలన్ల నీరే ఉన్నట్లు అందుబాటులో ఉన్న గణాంకాలు సూచిస్తున్నాయి. అంటే మొత్తం సామర్థ్యంలో దాదాపు 25 శాతం మాత్రమే నిల్వ ఉంది. రోజువారీ నీటి వినియోగం సుమారు 60 లక్షల గ్యాలన్లుగా అంచనా వేస్తున్న నేపథ్యంలో నవంబరు, డిసెంబరు నెలల్లో కురిసే వర్షాలు కీలకం కానున్నాయి. కల్యాణి డ్యామ్ నుంచి సరఫరా, జలాశయాల్లోకి కొత్తగా చేరే నీరు, భక్తుల రద్దీ.. ఇవన్నీ వచ్చే వేసవిలో నీటి లభ్యతను నిర్ణయించనున్నాయి.

## నిల్వల్లో భారీ వ్యత్యాసం

తిరుమలలోని పాపవినాశనం, గోగర్భం, ఆకాశగంగ, కుమారధార, పసుపుధార జలాశయాలు కొండపై నీటి అవసరాలకు ప్రధాన ఆధారం. వీటి పూర్తి నిల్వ సామర్థ్యంతో పోలిస్తే ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీరు గణనీయంగా తక్కువగా ఉంది. పాపవినాశనం జలాశయంలో 2,688.35 లక్షల గ్యాలన్ల నీరు ఉండగా, గోగర్భంలో 508.31 లక్షల గ్యాలన్లు మాత్రమే ఉన్నాయి. 685 లక్షల గ్యాలన్ల సామర్థ్యమున్న ఆకాశగంగలో 30.40 లక్షల గ్యాలన్లు, కుమారధారలో 363.98 లక్షల గ్యాలన్లు, పసుపుధారలో 24.38 లక్షల గ్యాలన్ల నీరు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ముఖ్యంగా ఆకాశగంగ, పసుపుధార జలాశయాల్లో నిల్వలు తక్కువగా ఉండటం ఆందోళన కలిగించే అంశం.

## రోజుకు 60 లక్షల గ్యాలన్లు..

తిరుమలలో భక్తుల సంఖ్య, వసతి గదుల వినియోగం, అన్నప్రసాద కేంద్రాల అవసరాలు, పారిశుద్ధ్య నిర్వహణను బట్టి నీటి డిమాండ్ మారుతూ ఉంటుంది. రోజుకు సుమారు 60 లక్షల గ్యాలన్ల నీరు అవసరమవుతున్నట్లు వార్తా నివేదికల్లో అంచనాలు వెలువడ్డాయి. ఇదే స్థాయిలో వినియోగం కొనసాగితే జలాశయాల్లోని నీటిపై ఒత్తిడి పెరగడం సహజం. అయితే, ప్రస్తుత నిల్వలన్నీ పూర్తిగా వినియోగించుకోగలిగేవి కావు. కొత్తగా చేరే నీరు, ఇతర వనరుల నుంచి సరఫరా, పంపింగ్ సామర్థ్యం, వాస్తవ వినియోగం ఆధారంగానే నీటి లభ్యతను అంచనా వేయాల్సి ఉంటుంది.



## కల్యాణి డ్యామ్ ఎంత ఆదుకుంటుంది.?

తిరుపతి సమీపంలోని కల్యాణి డ్యామ్ నుంచి తిరుమలకు నీటిని పంపింగ్ చేసి సరఫరా చేస్తున్నారు. గత వార్తా నివేదికల్లో రోజుకు సుమారు 30 లక్షల గ్యాలన్ల నీరు అందిస్తున్నట్లు ప్రస్తావించారు. అయితే, ప్రస్తుతం వాస్తవంగా ఎంత నీరు పంపింగ్ చేస్తున్నారు? డ్యామ్‌లో అందుబాటులో ఉన్న నిల్వ ఎంత? వచ్చే వేసవిలోనూ ఇదే స్థాయిలో నీటిని అందించే పరిస్థితి ఉందా? అనే ప్రశ్నలకు అధికారిక సమాధానాలు అవసరం. తిరుమలలోని ఐదు జలాశయాల నిల్వలతోపాటు కల్యాణి డ్యామ్ నుంచి వచ్చే నీటిని కూడా పరిగణనలోకి తీసుకున్నప్పుడే మొత్తం నీటి భద్రతపై స్పష్టత వస్తుంది.

## వర్షాలే ఆశాకిరణం..

నవంబరు, డిసెంబరు నెలల్లో ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో కురిసే వర్షాలు తిరుమల, తిరుపతి పరిసర ప్రాంతాల జలాశయాలకు ఊరటనిచ్చే అవకాశం ఉంది. అయితే, వర్షాలు కురిసినంత మాత్రాన జలాశయాలు పూర్తిగా నిండిపోతాయని చెప్పలేం. పరీవాహక ప్రాంతాల్లో వర్షపాతం, నీటి ప్రవాహం, భూమిలోకి ఇంకిపోయే నీరు, జలాశయాల ప్రస్తుత స్థితి వంటి అంశాలు కీలకంగా ఉంటాయి. మరోవైపు, ఎల్‌నినో పరిస్థితులపై చర్చ జరుగుతున్నప్పటికీ, వాటి ప్రభావంతో తిరుమలలో కచ్చితంగా నీటి కొరత ఏర్పడుతుందని ఇప్పుడే నిర్ధారించలేం. వాతావరణ శాఖ అంచనాలతోపాటు జలాశయాల నిల్వలను నిరంతరం పర్యవేక్షించాల్సిన అవసరం ఉంది.

## ముందస్తు ప్రణాళిక ఎక్కడ.?

నీటి నిల్వలు తగ్గిన తర్వాత ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించడం కంటే ముందుగానే కార్యాచరణ రూపొందించుకోవడం ఉత్తమం. జలాశయాల్లో పూడిక తొలగింపు, లీకేజీల నివారణ, వర్షపు నీటి సంరక్షణ, పైపులైన్ల నిర్వహణ, అవసరమైన చోట అదనపు పంపింగ్ ఏర్పాట్లు వంటి అంశాలపై టీటీడీ దృష్టి సారించాలి. వసతి సముదాయాలు, హోటళ్లు, ఇతర వాణిజ్య సంస్థల్లో నీటి వృథాను అరికట్టడంతోపాటు భక్తులకు పొదుపుపై అవగాహన కల్పించాలి. ముఖ్యంగా తాగునీరు, అన్నప్రసాదం, పారిశుద్ధ్య సేవలకు అంతరాయం కలగకుండా ప్రాధాన్య క్రమంలో నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలి.

## వేసవి వరకు సరిపోతుందా.?



ప్రస్తుతం ఉన్న 3,615 లక్షల గ్యాలన్ల నిల్వలను రోజుకు 60 లక్షల గ్యాలన్ల వినియోగంతో పోలిస్తే సుమారు 60 రోజుల అవసరానికి సమానంగా కనిపిస్తున్నాయి. అయితే, ఇది జలాశయాల నిల్వలు, రోజువారీ వినియోగం ఆధారంగా చేసిన సరళమైన గణన మాత్రమే. కల్యాణి డ్యామ్ నుంచి సరఫరా, కొత్తగా చేరే వర్షపు నీరు, వాస్తవ వినియోగం, ఉపయోగించగల నిల్వలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా నీరు ఎన్ని రోజులకు సరిపోతుందో ఖచ్చితంగా చెప్పలేం. అందువల్ల వచ్చే ఏడాది వేసవి వరకు తిరుమలకు నీటి సరఫరాపై టీటీడీ సమగ్ర అంచనా విడుదల చేయాల్సిన అవసరం ఉంది. భక్తుల రద్దీకి తగ్గట్టుగా నీటి సరఫరా వేసవికి ముందే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు. జలాశయాల సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకునే చర్యలు.. ఇవే ఇప్పుడు టీటీడీ ముందున్న ప్రధాన సవాళ్లు. తిరుమలలో నీటి సమస్య తలెత్తకుండా ఇప్పటి నుంచే పక్కా ప్రణాళిక రూపొందిస్తేనే భక్తులకు భరోసా కల్పించగలరు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588